# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 1 | శనివారం | 15.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 1 | Saturday | 15.08.2026 | Pages: 8 | Rate: 2




## రాజ్య సంస్కరణ

### ప్రజల పక్షాన.. ప్రజాస్వామ్య బాటలో..!

స్వాతంత్ర్య దినోత్సవం రోజున 'రాజ్య సంస్కరణ' తొలి అడుగు వేస్తోంది. దేశం స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్న ఈ పవిత్ర రోజునే మా పత్రిక తన ప్రయాణాన్ని ప్రారంభించడం వెనుక ఒక బలమైన ఆలోచన ఉంది. స్వాతంత్ర్యం అంటే కేవలం పరాయి పాలన నుంచి విముక్తి కాదు.. ప్రజలకు నిజం తెలుసుకునే హక్కు, ప్రశ్నించే స్వేచ్ఛ, తమ సమస్యలను చెప్పుకునే అవకాశం, బాధ్యతాయుతమైన పాలన అందుకోవడం కూడా.

'రాజ్య సంస్కరణ' కేవలం వార్తలను అందించే పత్రికగా కాకుండా.. సమాజాన్ని ఆలోచింపజేసే వేదికగా నిలవాలని సంకల్పిస్తోంది. అధికారం ఎవరిదైనా.. మా కలం ప్రజల పక్షాన నిలుస్తుంది. ప్రశ్నించాల్సిన చోట ప్రశ్నిస్తాం.. మంచి జరిగితే అభినందిస్తాం.. తప్పు జరిగితే ఆధారాలతో ఎత్తిచూపుతాం. సంచలనం కంటే సత్యానికి, వేగం కంటే విశ్వసనీయతకు ప్రాధాన్యం ఇస్తాం.

రైతు నుంచి ఉద్యోగి వరకు.. విద్యార్థి నుంచి మహిళ వరకు.. సామాన్యుడి సమస్యలకు మా పేజీల్లో స్థానం ఉంటుంది. ప్రజల గొంతు వినిపించేలా, పాలకులను బాధ్యత వహించేలా చేసే జర్నలిజమే మా లక్ష్యం.

ఈ ప్రయాణంలో మీ ఆదరణతో పాటు మీ సూచనలు, విమర్శలు, సహకారం కూడా మాకు అవసరం. 'రాజ్య సంస్కరణ'ను మీ పత్రికగా భావించి ఆదరించాలని, ఆద్యంతం అండగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుతున్నాను.

- గుండెబోయిన వెంకన్న, చీఫ్ ఎడిటర్

# కాక్రోచ్ తూచ్...



## నేను చెప్పింది వేరు.. ప్రచారం వేరు

వ్యాఖ్యలను వక్రీకరించారన్న సీజేఐ

'కాక్రోచ్ జనతా పార్టీ'తో మొదలైన నిరసన

లైవ్‌స్ట్రీమింగ్‌కు వ్యతిరేకం కాదు - 4లో...

'కాక్రోచ్' వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వివరణ ఇచ్చారు. తాను చెప్పిన మాటలను తప్పుగా ఉటంకించి, దురుద్దేశంతో ప్రచారం చేశారని ఆయన స్పష్టం చేశారు. మే 15న కోర్టు విచారణ సందర్భంగా నకిలీ డిగ్రీలు కలిగిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారనే సందర్భంలో 'కాక్రోచ్' అనే పదం ప్రస్తావనకు వచ్చింది. అయితే ఆ వ్యాఖ్యలకు పూర్తి సందర్భం లేకుండా చిన్న వీడియో క్లిప్‌లను సోషల్ మీడియాలో వైరల్ చేయడం వల్ల యువతలో అపోహలు ఏర్పడ్డాయని సీజేఐ పేర్కొన్నారు.



## పైసల ముందు శత్రుత్వం బలాదూర్ - 4లో...

**మళ్లీ జట్టుకడుతున్న ట్రంప్-మస్క్**

వెయ్యి కోట్ల ప్రాజెక్టుతో కొత్త డీల్.. ఎన్నికల కోసం భారీ సాయం

తెరవెనుక రాజీ ప్రయత్నాలు.. నెలకోసారి కీలక చర్చలు



- 3లో...

## ట్రంప్ నమ్మినబంటు.. వైట్‌హౌస్‌కు గుడ్‌బై

**28 ఏళ్లకే చరిత్ర సృష్టించిన లీవిట్, రాజీనామా**

కుటుంబం కోసం కీలక నిర్ణయం.. మీడియాతో ఢీ.. ట్రంప్‌కు గట్టి రక్షణ

## సీఎం కనుసన్నల్లో భూ దందా?

నిషేధిత జాబితాపై ఈటల ఆరోపణలు

కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు



తెలంగాణలో భూములను నిషేధిత జాబితాలో చేర్చే వ్యవహారంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో కొంతమంది ఐఏఎస్ అధికారులు ఉద్దేశపూర్వకంగా విలువైన భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నారని ఆయన ఆరోపించారు. సీఎం లేదా ఆయనకు సంబంధించిన వ్యక్తుల నుంచి క్లారిఫికేషన్ వచ్చిన తర్వాతే ఆ భూములను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఈటల పేర్కొన్నారు. భూముల విలువ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ తరహా వ్యవహారం జరుగుతోందని ఆరోపించారు. బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ చివరకు డబ్బులు వసూలు చేసే ప్రయత్నంగా దీనిని ఆయన అభివర్ణించారు.



## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై భరోసా

**చదువే తలరాత మార్చే ఆయుధం!** - 2లో...

నైపుణ్యాలతోనే భవిష్యత్ భరోసా.. విద్యతోనే ఆత్మగౌరవమన్న సీఎం

## ఇకపై స్మార్ట్ కార్డు..!

ట్యాంపరింగ్‌కు చెక్.. డిజిటల్ కార్డులు

సంగారెడ్డిలో నేడు శ్రీకారం

ట్యాంపరింగ్‌కు ఇక అవకాశం లేదు

రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్




- 2లో...

స్మార్ట్ రేషన్ కార్డుపై మోదీ ఫొటో

అన్ని సరుకులు ఇవ్వాలి: రఘునందన్



- 2లో...

## ఫుల్ క్లారిటీ

నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం

బయటి నేతల పెత్తనంతోనేనన్న రాజన్న

ప్రజాపాలనలో తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం


కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం పెరిగిందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలతో ఎవరినీ నొప్పించాలనే ఉద్దేశం లేదని తెలిపారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టంగా చెప్పారు.



- 2లో...

## తెలంగాణ పోలీసులకు పతకాల పంట

15 రాష్ట్రపతి పతకాలు సొంతం... ధైర్యానికి దక్కిన గౌరవం



## స్వరాష్ట్ర ఆకాంక్షకు ప్రతీక

తెలంగాణ భవన్‌కు రెండు దశాబ్దాలు - 2లో...

**రేవంత్ కుటుంబంపై భూ కేటాయింపు ఆరోపణలు**

లోకాయుక్తను ఆశ్రయించిన బీఆర్ఎస్ నేతలు



- 2లో...

## రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

పెట్టుబడులు, ఇళ్లు, రైతులకు వరాలు

కేబినెట్ కీలక నిర్ణయాలు

రైతులు, యువతకు కీలక నిర్ణయాలు

ఆటోలకు ఈవీ.. సాగునీటికి భారీ నిధులు

## కింగ్ నాగార్జునకు సైబర్ షాక్



ఏడు గంటలు డిజిటల్ అరెస్ట్

స్టార్ హీరోకూ తప్పని సైబర్ ముప్పు - 4లో...



- 2లో...

## పార్టీ వేదికపై చర్చించండి

**రాజగోపాల్‌కు పీసీసీ చీఫ్ సూచన**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి సహా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని తెలిపారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమ ంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్య లపై హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీకి సంబంధించిన అంశాలను నాలుగు గోడల మధ్య చర్చించుకోవాలని సూచించారు.



## గోదావరి పుష్కరాల్లో అలసత్వానికి చోటులేదు

సెప్టెంబర్‌లో పనులు.. ఆగస్టులో టెండర్లు - 2లో...

సమన్వయంతో పనిచేయాలన్న శ్రీధర్ బాబు



## నేరాల స్వరూపం మారుతోంది

సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ - 4లో...

డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి

# ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై భరోసా

## చదువే తలరాత మార్చే ఆయుధం!... విద్యతోనే ఆత్మగౌరవమన్న సీఎం





చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను నెక్లెస్ రోడ్డులో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్య ఒక్కటే తలరాతను మార్చే మార్గమని పేర్కొన్నారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా పూలే విద్య ప్రాధాన్యాన్ని చాటిచెప్పారని గుర్తుచేశారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం కోసం అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువు కోవాలని సీఎం అన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అవసరమైన అన్ని సదుపాయాలు అందించే దిశగా విద్యా వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల ఫీజు భారం తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని సీఎం స్పష్టం చేశారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ముందుగానే జమ చేసే విధానాన్ని ఈ ఏడాది నుంచే అమల్లోకి తెచ్చామని తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందిన తర్వాత విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే నెల రోజుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలగకుండా రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు.

### నైపుణ్యాలతోనే భవిష్యత్ భరోసా

సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని, విద్యతో పాటు నైపుణ్యాలు కూడా అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు స్కిల్స్ నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని, అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. బీసీ జనగణన, ఎస్సీ వర్గీకరణ వంటి నిర్ణయాలను సామాజిక న్యాయంలో భాగంగా ప్రస్తావించారు. పేద, బలహీన వర్గాల పిల్లలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, వైద్యులు, ఇంజినీర్లు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు నాణ్యమైన విద్య, నైపుణ్యాలే కీలకమని పేర్కొన్నారు.



## గోదావరి పుష్కరాల్లో అలసత్వానికి చోటులేదు

**సెప్టెంబర్‌లో పనులు.. ఆగస్టులో టెండర్లు**

**సమన్వయంతో పనిచేయాలన్న శ్రీధర్ బాబు**

గోదావరి పుష్కరాలు--2027ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. పుష్కరాల ఏర్పాట్లపై సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు అధ్యక్షత వహించారు. సెప్టెంబర్ మొదటి వారంలో పనులు తప్పనిసరిగా ప్రారంభం కావాలని, ఆగస్టు చివరి నాటికే టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పుష్కరాల కోసం ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించిందని తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే టైర్-1 ప్రాంతాల్లో ప్రత్యేక అధికారులను నియమించాలని, కీలక ప్రాంతాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేస్తూనే నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని హెచ్చరించారు. పనుల పురోగతిని అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

**శాఖల మధ్య సమన్వయమే కీలకం**

పుష్కరాల పనుల పురోగతిని రోజువారీగా తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే లక్షలాది మంది భక్తులకు ఇబ్బందులు లేకుండా పుష్కరాలను నిర్వహించగలమన్నారు. సబ్ కమిటీ సభ్యుల సూచనలను అధికారులు తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. పుష్కరాల ఏర్పాట్లలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవని శ్రీధర్‌బాబు హెచ్చరించారు.



## రేవంత్ కుటుంబంపై భూ కేటాయింపు ఆరోపణలు

**లోకాయుక్తను ఆశ్రయించిన బీఆర్ఎస్ నేతలు**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూకేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు లోకాయుక్తను ఆశ్రయించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ కోటి రెడ్డి తదితరులు లోకాయుక్త జస్టిస్ ఏ. రాజశేఖర్‌రెడ్డిని కలిసి ఫిర్యాదు అందించారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో ఐదెకరాల ప్రభుత్వ భూమిని సీఎం సోదరుడు కొండల్‌రెడ్డికి సంబంధించిన 'టెస్సెరాక్ట్' కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించారన్నది వారి ప్రధాన ఆరోపణ. ఏరోస్పేస్ సంస్థగా పేర్కొంటున్న కంపెనీ చెల్లించిన మూలధనం కేవలం రూ.లక్ష మాత్రమేనని, కంపెనీ బోర్డు నివేదికలో ఉద్యోగుల సంఖ్య సున్నాగా ఉందని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. నివాస చిరునామాతో ఉన్న కంపెనీకి ఇంత విలువైన భూమిని ఎలా కేటాయించారని ప్రశ్నించారు.

**ఆధారాలతో విచారణకు డిమాండ్**

టెస్సెరాక్ట్ కంపెనీకి సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి చైర్మన్‌గా, సీఎం మేనల్లుడు నయన్‌రెడ్డి సీఈవోగా ఉన్నారని చూపించే ఆధారాలను లోకాయుక్తకు సమర్పించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తిన తర్వాత కంపెనీ వెబ్‌సైట్‌లో వివరాలను రాత్రికి రాత్రే మార్చారని ఆరోపించారు. మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీలో చెప్పిన వివరాలకు భూ కేటాయింపుల అంశానికి సంబంధించి విభేదాలు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ భూకేటాయింపులను అంగీకరించారని తెలిపారు. ఈ వ్యవహారం కర్ణాటకలోని ముడా వివాదం తరహాలో ఉందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. టెస్సెరాక్ట్ భూకేటాయింపులను వెంటనే నిలిపివేసి రద్దు చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి పాత్రపై సమగ్ర విచారణ జరిపి నివేదికను గవర్నర్‌కు పంపాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, టీజీఐఐసీ అధికారులపై అవినీతి నిరోధక చట్టం, బీఎన్ఎస్ నిబంధనల కింద విచారణ చేపట్టాలని కోరారు.



## ఫుల్ క్లారిటీ

**నిజమైన కార్యకర్తలకు అన్యాయం.. బయటి నేతల పెత్తనంతోనేనన్న రాజన్న**

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం పెరిగిందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలతో ఎవరినీ నొప్పించాలనే ఉద్దేశం లేదని తెలిపారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో సీతారామచంద్రస్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని స్పష్టంగా చెప్పారు. తాను కాంగ్రెస్ నాయకులను ఎక్కడా విమర్శించలేదని, భవిష్యత్తులోనూ విమర్శించబోనని అన్నారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను అణిచివేస్తున్న పరిస్థితిని మాత్రమే గుర్తు చేశానని వివరించారు. పార్టీ కోసం ఏళ్లుగా పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం లభించాల్సిన అవసరం ఉందని రాజ్‌గోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

**ప్రజాపాలనలో తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను మరింత బలంగా కొనసాగించాలని రాజ్‌గోపాల్ రెడ్డి సూచించారు. ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలని, పేదల కోసం ప్రభుత్వం పనిచేయాలని కోరారు. తెలంగాణ కాంగ్రెస్, ప్రభుత్వం సీమాంధ్ర పాలకులు లేదా సీమాంధ్ర మీడియా ప్రభావంతో నడవకూడదని వ్యాఖ్యానించారు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల సంక్షేమం కోసం నిర్ణయాలు ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని గుర్తుచేసిన ఆయన, తెలంగాణ అభివృద్ధి కూడా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. దీంతో గతంలో చేసిన వ్యాఖ్యలపై తన వైఖరిని మరోసారి స్పష్టం చేసిన రాజ్‌గోపాల్ రెడ్డి, పార్టీపై తనకు ఉన్న నిబద్ధతను వెల్లడించారు.




## ఇకపై స్మార్ట్ కార్డు..!

**ట్యాంపరింగ్‌కు చెక్.. డిజిటల్ కార్డులు**

**సంగారెడ్డిలో నేడు శ్రీకారం**

తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థకు ప్రభుత్వం కొత్త రూపు తీసుకొస్తోంది. పాత జిరాక్స్ రేషన్ కార్డులకు స్వస్తి పలికి పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను అందించనుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు కార్డులు అందించనున్నారు. సంగారెడ్డిలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. 12 ఏళ్లకు పైగా జిరాక్స్ కాగితాలనే రేషన్ కార్డులుగా ఉపయోగించిన పరిస్థితికి ఇప్పుడు తెరపడనుంది.

**ట్యాంపరింగ్‌కు ఇక అవకాశం లేదు**

కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల్లో ఆధునిక సాంకేతికతను ఉపయోగించారు. చిప్, బార్‌కోడ్, క్యూఆర్ కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ వంటి భద్రతా ఫీచర్లు కార్డులో ఉంటాయి. ఏటీఎం, పాన్‌కార్డు తరహాలో రూపొందించిన ఈ పీవీసీ కార్డును స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు కనిపిస్తాయి. క్యూఆర్ కోడ్ కారణంగా డూప్లికేట్ కార్డులకు అవకాశం తగ్గుతుంది. కార్డు ముందు భాగంలో కుటుంబ యజమాని ఫొటో, రేషన్ కార్డు నంబర్, రేషన్ దుకాణం నంబర్ ముద్రిస్తారు. వెనుక భాగంలో కుటుంబ సభ్యుల వివరాలు, అవసరమైన ఇతర సమాచారం ఉంటుంది. పారదర్శకత పెంచడం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, లబ్ధిదారుల గుర్తింపును సులభతరం చేయడం ఈ స్మార్ట్ కార్డుల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం చెబుతోంది.

**రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్**

ప్రస్తుతం బయోమెట్రిక్ విధానంతో రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో సరుకులు తీసుకునే అవకాశం ఉంది. కొత్త స్మార్ట్ కార్డులతో ఈ ప్రక్రియ మరింత సులభం కానుంది. రాష్ట్రంలోని ఏ రేషన్ దుకాణంలోనైనా లబ్ధిదారులు సరుకులు పొందే విధానం మరింత సౌకర్యవంతంగా మారనుంది. ఇప్పటికే రేషన్ కార్డు ఉన్నవారు తమ పాత కార్డును రేషన్ షాప్‌లో చూపించి కొత్త స్మార్ట్ కార్డు పొందవచ్చు. అలాగే టీఎస్ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు. పాత కార్డులు చినిగిపోవడం, వివరాల విషయంలో ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలకు కొత్త కార్డులు పరిష్కారంగా మారనున్నాయి. పంద్రాగస్టు నుంచి ప్రారంభమయ్యే ఈ పంపిణీతో తెలంగాణ రేషన్ వ్యవస్థ మరింత ఆధునిక, డిజిటల్ రూపంలోకి అడుగుపెట్టనుంది.ం

### స్మార్ట్ రేషన్ కార్డుపై మోదీ ఫొటో

**అన్ని సరుకులు ఇవ్వాలి: రఘునందన్**

తెలంగాణ ప్రభుత్వం జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో తప్పనిసరిగా ఉండాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం అందిస్తున్న బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం వాటానే అని గుర్తుచేశారు. అలాంటప్పుడు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు మాత్రమే ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రేషన్ కార్డుల సంఖ్య, ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని కోరారు. రేషన్ కార్డుల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు వంటి నిత్యావసర సరుకులు అందించాలని రఘునందన్ సూచించారు. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు ఇవ్వాలని కోరారు. రేషన్ డీలర్లకు హామీలను అమలు చేసి గౌరవ వేతనం చెల్లించాలని, పెంచిన కమిషన్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

**పెట్టుబడులు, ఇళ్లు, రైతులకు వరాలు**

**కేబినెట్ కీలక నిర్ణయాలు**

తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు జరగనుంది. ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా తదితర రంగాల్లో పెట్టుబడి అవకాశాలను చాటిచెప్పనున్నారు. తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమల విజయాలు, కొత్త ఆవిష్కరణల కోసం ప్రత్యేక ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్‌కమిటీతో పాటు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. క్యూఆర్ఈ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు భూముల కేటాయింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఘనంగా నిర్వహించేందుకు కేబినెట్ నిర్ణయించింది.



**రైతులు, యువతకు కీలక నిర్ణయాలు**

వానాకాలం పంటలో ఏడు రకాల సన్న ధాన్యాల సాగును ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయించింది. గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా రైతులకు విస్తృత అవగాహన కల్పించనున్నారు. ఈ ఏడాది నుంచి ఆ ఏడు రకాల సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించనున్నారు. ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో కొత్త యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు అనుమతి ఇచ్చింది. తొలి విడతలో 113 నియోజకవర్గాల్లో స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలన్న లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 86 స్కూళ్లకు అనుమతులు లభించాయి. మిగిలిన ప్రాంతాల్లో స్థల సేకరణ పూర్తి చేసి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. దీంతో విద్య, నైపుణ్యాభివృద్ధికి కొత్త దిశ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ఆటోలకు ఈవీ.. సాగునీటికి భారీ నిధులు**

హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కాలుష్య నియంత్రణకు రూ.200 కోట్లతో పెట్రోల్, డీజిల్ ఆటోలను ఈవీలుగా మార్చే ప్రత్యేక పథకానికి కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న 18,766 ఆటోల్లో అర్హులైన డ్రైవర్లకు ఒక్కో వాహనంపై గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. నగరం లోని కాలుష్య పరిశ్రమలను శివారు ప్రాంతాలకు తరలించే హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును అక్టోబర్ 31 వరకు మరో మూడు నెలలు పొడిగించారు. మరోవైపు మక్తల్--నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2కు రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు, ప్రాంతానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందనుంది.




## స్వరాష్ట్ర ఆకాంక్షకు ప్రతీక

**తెలంగాణ భవన్‌కు రెండు దశాబ్దాలు**

బీఆర్ఎస్ తెలంగాణ భవన్ ప్రారంభమై సరిగ్గా 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్ర ఆకాంక్షను చాటేలా, తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని నిలబెట్టేలా తెలంగాణ భవన్ నిలిచిందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు ఒక వేదికగా తెలంగాణ భవన్ కీలక పాత్ర పోషించిందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో వ్యూహాలు, ప్రతివ్యూహాల రూపకల్పనకు ఈ భవన్ వేదికగా నిలిచిందని కేటీఆర్ గుర్తుచేశారు. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత దశాబ్ద కాలం తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రస్థానానికి తెలంగాణ భవన్ సాక్ష్యంగా నిలిచిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు తెలంగాణ భవన్ ఒక 'జనతా గ్యారేజ్'లా మారిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌ను 'తెలంగాణ భువన విజయం'గా అభివర్ణిస్తూ ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, తెలంగాణ ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు కూడా తెలంగాణ భవన్ రెండు దశాబ్దాల ప్రస్థానాన్ని గుర్తుచేశారు. నాడు స్వరాష్ట్ర పోరులో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమ వేదికగా తెలంగాణ భవన్ నిలిచిందని చెప్పారు. నేడు ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కొండంత అండతో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే అసలైన 'జనతా గ్యారేజ్'గా మారిందని పేర్కొన్నారు.

## పార్టీ వేదికపై చర్చించండి

**రాజగోపాల్‌కు పీసీసీ చీఫ్ సూచన**



మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి సహా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. రాజగోపాల్‌రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని తెలిపారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీకి సంబంధించిన అంశాలను నాలుగు గోడల మధ్య చర్చించుకోవాలని సూచించారు. రాజగోపాల్‌రెడ్డి ఆవేదన, ఆందోళనను తాము అర్థం చేసుకుంటామని చెప్పారు. ఆయన ప్రజా నాయకుడని, తనకు మంచి మిత్రుడని పేర్కొన్న మహేశ్‌కుమార్ గౌడ్, బహిరంగంగా మాట్లాడటం సరికాదన్నారు. ఏం మాట్లాడినా పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్తుందని స్పష్టం చేశారు. సమయం వచ్చినప్పుడు ప్రతి ఒక్కరికీ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. బిల్లుల విషయంలో ప్రభుత్వం క్రమపద్ధతిలో ముందుకు వెళ్తోందని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వ విధానాలను అనుసరించడం లేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి, కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేని వారు ప్రభుత్వంలో అధికారాన్ని అనుభవిస్తున్నారంటూ రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పీసీసీ చీఫ్ స్పందించడం కాంగ్రెస్‌లో అంతర్గత చర్చకు దారితీసింది.




## తెలంగాణ పోలీసులకు పతకాల పంట

**15 రాష్ట్రపతి పతకాలు సొంతం... ధైర్యానికి దక్కిన గౌరవం**

2026 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోలీసు శాఖకు మొత్తం 15 రాష్ట్రపతి పతకాలు ప్రకటించారు. విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు, అంకితభావం, విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు దక్కాయి. వీటిలో 3 గ్యాలంట్రీ మెడల్స్, 2 విశిష్ట సేవా పతకాలు, 10 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ఉన్నాయి. వీరత్వానికి ప్రతీకగా అందించే గ్యాలంట్రీ మెడల్స్‌కు తెలంగాణకు చెందిన జూనియర్ కమాండోలు బి. సత్యారావు, కే. సందీప్‌కుమార్, జే. వంశీకృష్ణ ఎంపికయ్యారు. విధి నిర్వహణలో అసాధారణ తెగువ ప్రదర్శించినందుకు వీరికి ఈ గౌరవం లభించింది. దీర్ఘకాలంగా అత్యుత్తమ సేవలు అందించిన ఇద్దరు పోలీసు సిబ్బందికి విశిష్ట సేవా పతకాలు ప్రకటించారు. మరో 10 మందికి ప్రతిభావంతమైన సేవా పతకాలు దక్కాయి. దీంతో తెలంగాణ పోలీసు శాఖకు ఈసారి పతకాల సంఖ్య 15కి చేరింది. ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు, అగ్నిమాపక, హోంగార్డ్స్, పౌర రక్షణ, కారాగార సేవల సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం ఈ పతకాలను ప్రకటిస్తుంది. వీరత్వానికి గ్యాలంట్రీ మెడల్, దీర్ఘకాల అత్యుత్తమ సేవలకు విశిష్ట సేవా పతకం, ప్రతిభావంతమైన సేవలకు మెరిటోరియస్ సర్వీస్ మెడల్ అందిస్తారు.

## సంపాదకీయం



# దేశవిభజన ఒక చీకటి అధ్యాయం!

స్వాతంత్ర్యం తెచ్చామని కాంగ్రెస్ నేతలు ఇప్పటికీ చంకలు గుద్దుకుంటుంటారు. స్వాతంత్ర్య పోరాటంలో తామే పాల్గొన్నామన్న భావన వ్యాప్తి చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకుంటారు. నిజానికి ఎందరో మహానుభావులు ఉద్యమించారు. లక్షల మంది అసువులు బాసారు. అన్నింటికి మించి కాంగ్రెస్ చేసిన దుర్మార్గం కారణంగా దేశం రెండు ముక్కలయ్యింది. లక్షలాది మంది శవాల మీద జెండా ఎగరేశారు. ఓ రకంగా ఆగస్ట్ 14 , 1947 కాళరాత్రి అని చెప్పకతప్పదు. 1947 ఆగస్టు 14 ఉదయం. ఒకవైపు కరాచీలో పాక్ అనే కొత్త దేశం పురుడుపోసుకుంటోందన్న సంబరాలు, మరోవైపు ఢిల్లీలో దశాబ్దాల పారతంత్రం వీడి స్వాతంత్ర్యపు వెలుగులు విరజిమ్మబోతున్నాయన్న సంబరం..కానీ, పంజాబ్, బెంగాల్‌లలోని లక్షలాది ఇళ్లలో మాత్రం హర్షాతిరేకాలు లేవు.. కేవలం కంటిమీద కునుకు లేని భయం, గుండెల్ని పిండేసే అనిశ్చితి మాత్రమే అక్కడి ప్రజల్లో కనిపించింది. దానికి కారణం తెల్లారితే తమ ఊరు, తమ ఇల్లు ఏ దేశంలో ఉంటాయో అక్కడ ఎవరికీ తెలియని దుర్భరమైన పరిస్థితి. సరిహద్దులను నిర్ణయించే బాధ్యతను బ్రిటీష్ న్యాయవాది జాన్ రెడ్‌క్లిఫ్‌కు అప్పగించినప్పటికీ, ఆయన గీసిన ఆ వినాశకరమైన గీత ఆగస్టు 14న బయటకు రాలేదు. ఆ తుది నిర్ణయాన్ని ఆగస్టు 17 వరకు దాచిపెట్టారు. అంటే అర్ధరాత్రి రెండు దేశాలు స్వతంత్రంగా మారినప్పటికీ, వేలాది కుటుంబాలకు తమ సొంత ఇల్లు భారత్‌లో ఉందో, పాకిస్థాన్‌లో ఉందో తెలియని ఒక విచిత్రమైన, విషాదకరమైన పరిస్థితిలో7 ఉండిపోయారు. విభజన ప్రకటన ఇరు ప్రాంతాల ప్రజల్లో తీవ్ర ఆవేదన, ఆందోళన నింపింది. అందుకే ఆగస్టు 14 భారత దేశానికి ఒక చీకటి రోజుగా పరిగణిస్తారు. ఇది స్వాతంత్ర్యం తీసుకుని వచ్చిన దానికన్నా పెను విషాదాన్ని నింపింది. ఒక రకంగా చెప్పాలంటే 1947 ఆగస్టు 14 రాత్రి కేవలం భారత్‌ను చీల్చడానికి ఉద్దేశించిన రోజుగానే చూడాలి. దేశాలను విభజించడానికి గీసిన గీతకు ఆనాటి పెద్దలు అంగీకారం తెలపడం నేటికీ జీర్ణించుకోలేని చరిత్రగా మిగిపోతుంది. విభజనకు గీసిన ఒక గీత మధ్య అసలు మనిషి ఎక్కడ నిలబడ్డాడనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలి పోయింది. ఈ చారిత్రక ఘట్టాన్ని అర్థం చేసుకోవాలంటే ముందుగా ఆగస్టు 14న కరాచీలో ఏం జరిగిందో చూడాలి. ఆ రోజు ఉదయం 9 గంటలకు సింధ్ అసెంబ్లీ భవనం బయట ఉత్సాహంతో జనం కిక్కిరిసిపోయారు. మహమ్మద్ అలీ జిన్నా, లార్డ్ మౌంట్‌బాటన్ ఒకే రాచరికపు బగ్గీలో అక్కడికి చేరుకున్నారు. కరాచీలోని రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశంలో అధికార మార్పిడి పక్రియ అధికారికంగా ముగిసింది. అయితే, మౌంట్‌బాటన్‌కు అక్కడ ఎక్కువ సేపు గడిపే వ్యవధి లేదు. మధ్యాహ్నం 2 గంటలకే ఆయన ఢిల్లీకి పయనమయ్యారు. ఎందుకంటే అదే రోజు అర్ధరాత్రి భారత్ స్వాతంత్య వేడుకల్లో ఆయన పాల్గొనాల్సి ఉంది. ఇక, కరాచీలో సంబరాలు ముగిసి ఢిల్లీలో అర్ధరాత్రి వేడుకలకు వేదిక సిద్ధమవుతుంటే, పంజాబ్‌లో మాత్రం సరిహద్దు రక్తసిక్తమయ్యింది. విభజన వార్త కేవలం పత్రికలకే పరిమితం కాకుండా ప్రజల గుమ్మాల ముందుకు వచ్చింది. హిందువులు, ముస్లింలు, సిక్కులు తమ ఇళ్లను వదిలి వెళ్లాలో వద్దో తెలియక కొట్టుమిట్టాడారు. పంజాబ్‌లో రైళ్లు నడుస్తున్నాయి, కానీ అవి కేవలం ప్రయాణికులను మాత్రమే కాక, ముక్కలైన జీవితాలను మోసుకెళ్తున్నాయి. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 8 మధ్య దాదాపు ఏడు లక్షల మంది శరణార్థులు రైళ్ల ద్వారా సరిహద్దులు దాటారని అంచనా. కానీ, అసలు భయానక దృశ్యం ఆగస్టు 17 తర్వాత మొదలైంది. రెడ్‌క్లిఫ్ లైన్ బహిర్గతమయ్యాక, తమ ఊరు పరాయి దేశంలోకి వెళ్లిపోయిందని తెలిసిన దాదాపు 1.5 కోట్ల మంది ప్రజలు కాలినడకన, బస్సుల్లో, రైళ్లలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని సరిహద్దులు దాటడం ప్రారంభించారు. మార్గమధ్యంలో శరణార్థుల కాఫిలాలు, రైళ్లపై దాడులు జరిగాయి. దహనమైన, నిశ్శబ్దంగా శవాల దిబ్బగా మారిన రైళ్లు స్టేషన్లకు చేరుకున్నాయి. ఈ హింసలో 5 నుంచి 10 లక్షల మంది లేదా కొన్ని అంచనాల ప్రకారం 15 నుంచి 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 75 వేల మంది మహిళలు కిడ్నాప్‌లు, లైంగిక హింసకు గురయ్యారు. దేశమంతా ఒకవైపు పండుగ వాతావరణం, మరోవైపు రక్తపాతంతో అల్లకల్లోలంగా ఉంటే, మహాత్మా గాంధీ మాత్రం ఈ వేడుకలకు చాలా దూరంగా కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్న హైదరీ మంజిల్‌లో ఉన్నారు. కలకత్తాలో ఆగస్టు 16-18 మధ్య జరిగిన హింసలో 4,000 మందికి పైగా చనిపోయిన వేళ, గాంధీ అక్కడే ఉండి శాంతి కోసం నిరాహార దీక్షలు చేపట్టారు. బ్రిటిష్ పాలన అధికారికంగా అంతమై, కొత్త పతాకం ఎగిరింది. కానీ, ఆ వెలుగుల వెనుక దట్టమైన చీకటి దాగి ఉంది. ఒకవైపు అధికార మార్పిడి, మరోవైపు కోట్ల మంది నిరాశ్రయుల కాళ్ల నడకలు..శాల దిబ్బలు వంటివన్నీ కళ్లముందు కదలాడాయి. జిన్నా ఎత్తులకు లొంగిపోవడంతో దేశం భారీ మూల్యం చెల్లించుకుంది. గాంధీ, నెహ్రూలు ప్రేక్షకపాత్ర వహించారు. మారణహోమాన్ని ఆపలేక పోయారు. ప్రజలను నడివీధుల్లో నిరాశ్రయులను చేశారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు ఆ క్షోభ నుంచి కోలుకోలేదు. స్వాతంత్ర్యం తెచ్చామని ప్రగల్భాలు పలుకుతున్న నేటి కాంగ్రెస్ నేతలు ఆనాటి మారణహోమానికి సమాధానం చెప్పగలరా? ఈ విభజన కేవలం కాంగ్రెస్ లొంగుబాటు తీరు వల్లే అని ప్రపంచానికి తెలియదా? దేశాన్ని ఐక్యంగా ఉంచడంలో విఫలమైన ఆనాటి కాంగ్రెస్ నాయకత్వాన్ని ఏమనాలి? ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి.

# విద్యార్థులపై చర్యలొద్దు!

## నాకు-వారికి మధ్య బీసీఐ జోక్యమేంటి?

- నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంది
- నల్సార్ వివాదంపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఘాటు వ్యాఖ్యలు
- ఆదేశాలు వెనక్కి తీసుకున్నామన్న బార్ కౌన్సిల్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14 :** నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులపై చర్యలకు సిద్ధమైన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తీరుపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇది నాకు, విద్యార్థులకు మధ్య ఉన్న విషయం. మా మధ్య జోక్యం చేసుకోవడానికి బార్ కౌన్సిల్ ఎవరు?" అంటూ ప్రశ్నించారు. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. నల్సార్ స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వివాదం మొదలైంది. దీనిపై స్పందించిన బార్ కౌన్సిల్.. 2026 బ్యాచ్ విద్యార్థులను తదుపరి ఆదేశాల వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని రాష్ట్ర బార్ కౌన్సిళ్లను ఆదేశించింది. విద్యార్థుల నిరసన వెనుక ఎవరున్నారనే అంశంపైనా విచారణ జరపాలని విశ్వవిద్యాలయాన్ని కోరింది. బార్ కౌన్సిల్ నిర్ణయంపై విమర్శలు వెల్లువెత్తడంతో వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బార్ కౌన్సిల్ తీరుపై తీవ్రంగా స్పందించింది. విద్యార్థులకు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతోపాటు నిరసన తెలిపే హక్కు ఉందని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో బార్ కౌన్సిల్ జోక్యం ఏమాత్రం అవసరం లేదన్నారు. అయితే విద్యార్థుల నమోదును నిలిపివేస్తూ ఇచ్చిన ఆదేశాలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు బార్ కౌన్సిల్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. దీంతో తదుపరి విచారణను సుప్రీంకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది. నల్సార్ స్నాతకోత్సవానికి చీఫ్ జస్టిస్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ సుమారు 450 మంది విద్యార్థులు విశ్వవిద్యాలయ అధికారులకు లేఖ రాయడంతో ఈ వివాదం మొదలైంది. విద్యార్థుల ఆందోళనలకు సంబంధించిన అంశాల్లో సుప్రీంకోర్టు వైఖరిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వారు ఆ లేఖ రాశారు.

# జనగణన-2027కు కేంద్రం రెడీ

- 40 ప్రశ్నలతో జాబితా నోటిఫై
- తొలిసారిగా సమగ్ర కుల గణనకు రంగం సిద్ధం
- 10వ ప్రశ్నలో ఎస్సీ, ఎస్టీ, కుల వివరాలు
- డిజిటల్ విధానంలో జనాభా లెక్కల సేకరణ
- రెండు దశల్లో ప్రక్రియ.. 11,718 కోట్ల వ్యయం



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశవ్యాప్తంగా చేపట్టనున్న 'జనగణన-2027'పై కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. జనగణన సందర్భంగా పౌరులను అడిగే 40 ప్రశ్నలతో కూడిన జాబితాను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నోటిఫై చేసింది. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా సమగ్ర కుల గణన చేపట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. జనగణన ప్రశ్నావళిలో 10వ ప్రశ్నగా ఎస్సీ, ఎస్టీ, కులానికి సంబంధించిన వివరాలను నమోదు చేసేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. దేశంలో తొలిసారిగా యాప్‌లు, డిజిటల్ సాధనాల ద్వారా జనాభా లెక్కలను సేకరించనున్నారు. పౌరులు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు 15 రోజుల పాటు అవకాశం కల్పించనున్నారు. రూ.11,718.24 కోట్ల అంచనా వ్యయంతో జనగణన--2027ను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశలో 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య గృహాల నమోదు, వసతులకు సంబంధించిన వివరాలను సేకరిస్తారు. రెండో దశలో 2027 ఫిబ్రవరిలో జనాభా, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. జనగణన సందర్భంగా పౌరులు అందించే వ్యక్తిగత వివరాలకు చట్టపరమైన రక్షణ ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. జనగణన చట్టం--1948లోని సెక్షన్ 15 ప్రకారం పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచనున్నారు.



# రాహుల్‌కు సుప్రీం ఊరట

## సావర్కర్ వ్యాఖ్యలపై పరువు నష్టం కేసు కొట్టివేత

## లఖ్‌నవూ మెజిస్ట్రేట్ జారీ చేసిన సమన్లు రద్దు

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. సావర్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ వ్యవహా రంలో రాహుల్‌కు లఖ్‌నవూ మెజిస్ట్రేట్ జారీ చేసిన సమ న్లను కూడా రద్దు చేసింది. భారత్ జోడో యాత్ర సంద ర్భంగా సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలను అభ్యం తరకరంగా పేర్కొంటూ నృపేంద్ర పాండే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సెక్షన్ 153ఏ కింద చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పిటిషన్‌ను తిరస్కరించగా, సెషన్స్ కోర్టులో సవాలు చేయడంతో కేసు తిరిగి మెజిస్ట్రేట్‌కు చేరింది. అనంతరం రాహుల్‌కు సమన్లు జారీ అయ్యాయి. వాటిని సవాలు చేస్తూ రాహుల్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ అక్కడ ఊరట లభించలేదు. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సెక్షన్ 153ఏ కింద విచారణ చేపట్టేందుకు అవసరమైన కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ముందస్తు అను మతి లేదని పేర్కొన్న సుప్రీంకోర్టు కేసును కొట్టివేసింది. అయితే స్వాతంత్ర్య సమరయోధుల గురించి వ్యాఖ్యలు చేసే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు సూచించింది.


# విభజన గాయాలు.. ఎన్నో జీవితాలు ఛిద్రం

## దేశ విభజనతో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయి

## భయానక పరిస్థితుల నుంచి జీవితాలను పునర్నిర్మించుకున్నారు

## బాధితుల ధైర్యం, పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

## 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే' సందర్భంగా ప్రధాని మోదీ





**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** దేశ విభజన ఎన్నో జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విభజన కారణంగా ప్రియమైన వారిని కోల్పోయి, తీవ్ర కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ జీవితాలను తిరిగి నిర్మించుకున్న బాధితుల ధైర్యం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. 'పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డే' సందర్భంగా దేశ విభజన బాధితులను మోదీ స్మరించుకున్నారు. దేశ విభజన, సామూహిక వలసలు, అనంతరం జరిగిన హింసలో ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం కేంద్ర ప్రభుత్వం 2021 నుంచి ప్రతి ఏటా ఆగస్టు 14న ఈ దినాన్ని పాటిస్తోంది. దేశ విభజనతో ఎన్నో కుటుంబాలు చెల్లాచెదురయ్యాయని, లక్షలాది మంది తమ ప్రియమైన వారిని, సొంత ప్రాంతాలను కోల్పోయి అంతులేని బాధను అనుభవించారని మోదీ పేర్కొన్నారు. అంతటి భయానక పరిస్థితులను అధిగమించి జీవితాలను పునర్నిర్మించుకోవడంతోపాటు ప్రతికూలతలను విజయంగా మార్చుకుని దేశ ప్రగతికి దోహదపడ్డారని తెలిపారు. విభజన బాధితుల జీవితాలు సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తాయని మోదీ పేర్కొన్నారు. వికసిత భారత్ నిర్మాణానికి సమష్టిగా కృషి చేసేందుకు వారి పోరాట స్ఫూర్తి దేశ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.



# మా సహనాన్ని బలహీనతగా భావించొద్దు

## అవసరమైతే ఎంతటి ముప్పునైనా ఎదుర్కొంటాం

## ఉగ్రవాదంపై దీటుగా స్పందిస్తామనే సందేశమిచ్చాం

## ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ముందే నిర్దేశించుకున్నాం

## జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత సహనాన్ని బలహీనతగా భావిస్తే పొరపాటేనని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో అవసరమైతే ఎంతటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై రూపొందించిన డాక్యుమెంటరీ సిరీస్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన లక్ష్యాలను ముందుగానే స్పష్టంగా నిర్ణయించుకున్నామని డోభాల్ తెలిపారు. దాడి వెనుక ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఉగ్రవాద చర్యలను భారత్ ఏమాత్రం సహించదని, అవసరమైతే దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఈ ఆపరేషన్ ద్వారా ఇచ్చామని పేర్కొన్నారు. "భారతదేశ సహనాన్ని బలహీనతగా భావించే పొరపాటు చేయొద్దు. దేశ ప్రయోజనాలు, భద్రత విషయంలో అవసరమైతే భారత్ ఎంతటి ముప్పునైనా ఎదుర్కోగలదు" అని డోభాల్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన పరిణామాలు, వ్యూహాలు, క్షేత్రస్థాయి అనుభవాలను డోభాల్‌తోపాటు ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు అధికారులు డాక్యుమెంటరీలో వివరించారు. శనివారం రాత్రి 9 గంటలకు ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. అనంతరం భారత్--పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, చివరకు కాల్పుల విరమణతో పరిస్థితి సద్దుమణిగింది.

# వందేమాతరం... వందేభారతం



### ఎర్రకోటపై చారిత్రక గర్జన
### జాతీయ గీతంతో సమాన రక్షణ
### తొలిసారి ఎర్రకోటపై గానం

భారత జాతీయ గీతం 'జనగణమన'తో పాటు జాతీయ గేయం 'వందేమాతరం'కు ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక స్థానం దక్కనుంది. ఆగస్టు 15న ఎర్రకోట బురుజుల నుంచి తొలిసారిగా వందేమాతరం ఆలపించనున్నారు. బంకించంద్ర ఛటర్జీ రచించిన ఈ గేయానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. 2,500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు జ్ఞాన్‌పథ్ వద్ద 'వందేమాతరం' ఆకారంలో నిలబడనున్నారు. భారత వైమానిక దళానికి చెందిన ఎంఐ-17 హెలికాప్టర్ పుష్పవర్షం కురిపించనుంది. ముఖ్యంగా వందేమాతరం తొలుత, జనగణమన తర్వాత ఆలపించేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

**చట్టపరమైన రక్షణతో కొత్త హోదా**

వందేమాతరానికి ఈసారి మరో కీలక గుర్తింపు లభించింది. 2026 జాతీయ గౌరవ అవమాన నిరోధక సవరణ చట్టం ద్వారా జాతీయ గీతానికి ఉన్న రక్షణను జాతీయ గేయానికీ వర్తింపజేశారు. ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానాన్ని అడ్డుకోవడం, అంతరాయం కలిగించడం నేరంగా పరిగణించనున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలలు, బహిరంగ సమావేశాల్లో ఆరు చరణాల పూర్తి రూపాన్ని ఆలపించే నిబంధనను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే సైనిక దళాలు, ఎన్‌సీసీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్ సహా వివిధ బలగాలకు కూడా ప్రత్యేక మార్గదర్శకాలు జారీ అయ్యాయి.

**1882 నుంచి జాతీయ గేయం వరకు**

వందేమాతరం తొలిసారిగా 1882లో బంకించంద్ర ఛటర్జీ రచించిన 'ఆనందమఠం' నవలలో ప్రచురితమైంది. స్వాతంత్ర్య ఉద్యమంలో ఇది ప్రజల్లో జాతీయ భావనను రగిలించిన గేయంగా ఎదిగింది. అయితే పూర్తి గేయంలోని కొన్ని చరణాల్లో మతపరమైన అంశాలు ఉన్నాయన్న అభ్యంతరాలతో 1937లో కాంగ్రెస్ తొలి రెండు చరణాలనే అధికారికంగా పాడాలని నిర్ణయించింది. గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, మౌలానా ఆజాద్ వంటి నేతలు దీనికి సమ్మతించారు. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ 'జనగణమన'ను జాతీయ గీతంగా, 'వందేమాతరం'ను జాతీయ గేయంగా గుర్తించింది. అప్పటినుంచి రెండింటికీ సమాన హోదా ఉన్నప్పటికీ చట్టపరమైన రక్షణ మాత్రం జనగణమనకే ఉండేది. ఇప్పుడు కొత్త చట్టంతో వందేమాతరానికి కూడా అదే స్థాయి రక్షణ రావడంతో 150 ఏళ్ల ప్రయాణం మరో కీలక మలుపు తిరిగింది.

# ఉగ్రవాదాన్ని సహించం

## అందుకే సింధు జల ఒప్పందం నిలిపివేత
## రాష్ట్రపతి ముర్ము స్వాతంత్ర్యదినోత్సవ సందశం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతిని ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశంతో సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం భారత్ ప్రయోజనాల దృష్ట్యా నిర్ణయాత్మక చర్య అని ఆమె స్పష్టం చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ సింధు జల ఒప్పందాన్ని అమలులో ఉంచకుండా నిలిపివేసిన విషయాన్ని రాష్ట్రపతి ప్రస్తావించారు. ముఖ్యంగా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారికి భారత్ నుంచి స్పష్టమైన సమాధానం వెళ్లిందని ఆమె వ్యాఖ్యలు సూచించాయి.




**సిందూర్.. సైనిక శక్తికి నిదర్శనం**

ఆపరేషన్ సిందూర్ ప్రస్తావన కూడా రాష్ట్రపతి ప్రసంగంలో ప్రధానంగా నిలిచింది. మే 7న ఆపరేషన్ సిందూర్ ప్రారంభమై ఏడాది పూర్తైన సందర్భంగా భారత సాయుధ బలగాల అసమాన ధైర్యసాహసాలను దేశం గుర్తుచేసుకుందని ఆమె తెలిపారు. ఉగ్రవాదంపై భారత సైన్యం అత్యంత కచ్చితత్వంతో చర్యలు తీసుకోగల సామర్థ్యాన్ని ఈ ఆపరేషన్ ప్రపంచానికి చూపించిందన్నారు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా, వారికి మద్దతు ఇచ్చేవారు ఎవరైనా పరిణామాలను ఎదుర్కోవాల్సి ఒదేనన్న స్పష్టమైన సందేశం వెళ్లిందని చెప్పారు. దేశ భద్రత విషయంలో ప్రభుత్వం, ప్రజలు ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు.

**యువతే దేశ భవిష్యత్తు**

దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు యువతేనని రాష్ట్రపతి తెలిపారు. యువత దేశానికి అత్యంత విలువైన ఆస్తి అని, విద్యార్థులు భారత భవిష్యత్తును నిర్మించే శక్తి అని పేర్కొన్నారు. ఇటీవల నీట్-యూజీ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో జరిగిన నిరసనలు, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి పరిణామాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరీక్షలను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. దేశ భద్రతతో పాటు విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం, సమాజం కలిసి పనిచేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

# విభజన గాయాలు



## బాధితులకు మోదీ నివాళి... అక్కడ్నుంచే దేశ నిర్మాణం

విభజన విభీషికా స్మృతి దినం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ విభజన బాధితులకు నివాళి అర్పించారు. విభజనతో కుటుంబాలు విడిపోయాయి, లక్షలాది మంది జీవితాలు తలకిందులయ్యాయి, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని మోదీ గుర్తుచేశారు. అయినా ఆ విషాదాన్ని అధిగమించి బాధితులు తమ జీవితాలను తిరిగి నిర్మించుకున్నారని ప్రశంసించారు. కష్టాలను అవకాశాలుగా మార్చుకుని దేశ అభివృద్ధికి ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. వారి జీవన ప్రయాణం మానవ సంకల్పానికి నిదర్శనమని అన్నారు. దేశంలో సామరస్యం, సోదరభావాన్ని కాపాడేందుకు ఈ రోజు మరింత సంకల్పంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విభజన గాయాల నుంచి పాఠాలు నేర్చుకుని అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి కలిసి పనిచేయాలని మోదీ సూచించారు.

**కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు**

మోదీ వ్యాఖ్యలతో పాటు బీజేపీ విభజన అంశాన్ని రాజకీయంగా ముందుకు తీసుకెళ్లింది. గురుగ్రామ్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్.. దేశ విభజనకు కాంగ్రెస్ నాయకత్వం, నెహ్రూ--గాంధీ కుటుంబమే బాధ్యత వహించాలని ఆరోపించారు. విభజన సమయంలో కోటిన్నర కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని, 30 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. రాజకీయ అధికారాన్ని సాధించేందుకు తీసుకున్న నిర్ణయాల ఫలితంగా కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా నష్టపోయారని విమర్శించారు. 1946 ఆగస్టు 16న జరిగిన 'డైరెక్ట్ యాక్షన్ డే'తో దేశంలో మత హింస మరింత ఉధృతమైందని నబీన్ గుర్తుచేశారు. విభజన విషాదానికి బాధ్యులు ఇప్పటికీ తమ వైఖరిని మార్చుకోలేదని ఆయన ఆరోపించారు.

**చరిత్రపై రాజకీయ పోరు**

విభజన చరిత్రను కొత్త తరానికి గుర్తుచేయడమే స్మృతి దినం ఉద్దేశమని బీజేపీ పేర్కొంది. ఈ సందర్భంగా బీజేపీ సోషల్ మీడియా ఖాతాలో నెహ్రూ, మహమ్మద్ అలీ జిన్నా చేతులు కలుపుతున్నట్లుగా రూపొందించిన ఏఐ వీడియోను కూడా పోస్టు చేసింది. కాంగ్రెస్‌పై విమర్శలు కొనసాగించిన నబీన్.. విభజన బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ బహిరంగ క్షమాపణ చెప్పలేదని ఆరోపించారు. దేశాన్ని ఐక్యం చేయాలని మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు గత నిర్ణయాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై కూడా నబీన్ విమర్శలు చేశారు. దీంతో ఆగస్టు 14న నిర్వహించిన విభజన విభీషికా స్మృతి దినం.. బాధితుల త్యాగాలను గుర్తుచేసే సందర్భంతో పాటు కాంగ్రెస్--బీజేపీ మధ్య పాత రాజకీయ విభేదాలను మళ్లీ తెరపైకి తెచ్చిన రోజుగా మారింది.

# కాక్రోచ్ తూచ్..



## నేను చెప్పింది వేరు.. ప్రచారం వేరు
## వ్యాఖ్యలను వక్రీకరించారన్న సీజేఐ

'కాక్రోచ్' వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వివరణ ఇచ్చారు. తాను చెప్పిన మాటలను తప్పుగా ఉటంకించి, దురుద్దేశంతో ప్రచారం చేశారని ఆయన స్పష్టం చేశారు. మే 15న కోర్టు విచారణ సందర్భంగా నకిలీ డిగ్రీలు కలిగిన కొందరు వ్యక్తులు సోషల్ మీడియా, ఆర్టీఐ కార్యకర్తలుగా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారనే సందర్భంలో 'కాక్రోచ్' అనే పదం ప్రస్తావనకు వచ్చింది. అయితే ఆ వ్యాఖ్యలకు పూర్తి సందర్భం లేకుండా చిన్న వీడియో క్లిప్‌లను సోషల్ మీడియాలో వైరల్ చేయడం వల్ల యువతలో అపోహలు ఏర్పడ్డాయని సీజేఐ పేర్కొన్నారు. చెప్పనిది చెప్పినట్లుగా ప్రచారం చేయడం దురదృష్టకరం అని ఆయన అన్నారు.

**'కాక్రోచ్ జనతా పార్టీ'తో మొదలైన నిరసన**

సీజేఐ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. యువత నుంచి వచ్చిన వ్యతిరేకతతో 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' పేరుతో వ్యంగ్య ఉద్యమం కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో కోర్టు విచారణల చిన్న క్లిప్‌లను సందర్భం లేకుండా ప్రచారం చేయడంపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయస్థాన ప్రక్రియపై మీడియా బాధ్యతగా వ్యవహరించాలి అని సూచించారు. ప్రతి పౌరుడికి హక్కులు ఉన్నట్లే బాధ్యతలు కూడా ఉంటాయని గుర్తు చేశారు. సమాజంలో సామరస్యం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను గుర్తుంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**లైవ్‌స్ట్రీమింగ్‌కు వ్యతిరేకం కాదు**

న్యాయవ్యవస్థలో పారదర్శకత అవసరమని సీజేఐ స్పష్టం చేశారు. అందులో భాగంగానే సుప్రీంకోర్టు విచారణలను లైవ్‌స్ట్రీమింగ్ చేస్తున్నామని తెలిపారు. అయితే ఆ ప్రసారాల నుంచి చిన్న వీడియోలు కత్తిరించి వ్యక్తిగత ప్రచారం, వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించడాన్ని మాత్రం అంగీకరించలేమని చెప్పారు.

ఇటీవల న్యాయ విచారణల ఆడియో, వీడియో రికార్డింగులను అనధికారికంగా పంచడం, రీపోస్ట్ చేయడం, అప్‌లోడ్ చేయడం, వాటి ద్వారా డబ్బు సంపాదించడంపై ఆంక్షలు విధించిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మొత్తంగా 'కాక్రోచ్' వివాదంలో తన వ్యాఖ్యల అసలు సందర్భాన్ని పక్కనపెట్టి ప్రచారం జరిగిందని సీజేఐ వివరణ ఇవ్వడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది.



# సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టివేత

## రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట

కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో కీలక ఊరట లభించింది. సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలతో మత విద్వేషాన్ని రెచ్చగొట్టారంటూ ఉత్తరప్రదేశ్‌లో దాఖలైన ప్రైవేట్ క్రిమినల్ ఫిర్యాదును సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టివేసింది. ఈ కేసులో అవసరమైన ప్రభుత్వ అనుమతి తీసుకున్నట్లు ఎలాంటి ఆధారం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ శీల్ నాగు ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో కూడా అనుమతికి సంబంధించిన వివరాలు లేవని అదనపు సొలిసిటర్ జనరల్, ఫిర్యాదుదారు తరఫు న్యాయవాది వెల్లడించిన నేపథ్యంలో కేసును రద్దు చేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ఈ కేసు 2022 నవంబర్ 17న రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సందర్భంగా చేసిన వ్యాఖ్యల ఆధారంగా నమోదైంది. వీర్ సావర్కర్ బ్రిటిష్ పాలకులకు సహకరించారని, బ్రిటిష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ కూడా పొందారని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు మతాల మధ్య విద్వేషాన్ని పెంచేలా ఉన్నాయని ఆరోపిస్తూ న్యాయవాది నృపేంద్ర పాండే ఉత్తరప్రదేశ్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మేజిస్ట్రేట్ రాహుల్‌కు సమన్లు జారీ చేశారు. ఆయనపై అప్పటి భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 153ఏ కింద వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం, సెక్షన్ 505 కింద ప్రజల్లో అపోహలు లేదా అశాంతికి దారితీసే వ్యాఖ్యలకు సంబంధించిన ఆరోపణలు నమోదయ్యాయి. ఈ సమన్లను రద్దు చేయాలని రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**సాంకేతిక లోపమే కేసుకు ముగింపు**

సుప్రీంకోర్టు ఈ దశలో రాహుల్ వ్యాఖ్యల వాస్తవం, సావర్కర్ చరిత్రపై రాజకీయ వివాదం వంటి అంశాల్లోకి వెళ్లలేదు. కేసు కొనసాగించేందుకు అవసరమైన అనుమతి తీసుకోలేదన్న అంశాన్నే ప్రధాన కారణంగా పరిగణించింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన అఫిడవిట్‌లో అనుమతికి సంబంధించిన సమాచారం లేకపోవడంతో ఫిర్యాదు, మేజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వులు రెండింటినీ ధర్మాసనం రద్దు చేసింది. దీంతో సావర్కర్ వ్యాఖ్యలపై రాహుల్ ఎదుర్కొంటున్న ఈ ప్రత్యేక క్రిమినల్ కేసుకు ప్రస్తుతానికి ముగింపు పడింది. అయితే సావర్కర్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రాజకీయ వివాదం మాత్రం కొనసాగుతూనే ఉంది. కోర్టు తీర్పు వ్యాఖ్యలు సరైనవా కాదా అన్న దానిపై కాకుండా.. కేసు నమోదు, కొనసాగింపుకు అవసరమైన చట్టపరమైన అనుమతి లేకపోవడంపైనే ఆధారపడింది.

# పైసల ముందు శత్రుత్వం బలాదూర్

## మళ్లీ జట్టుకడుతున్న ట్రంప్--మస్క్
## వెయ్యి కోట్ల ప్రాజెక్టుతో కొత్త డీల్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా-స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ మధ్య ఒకప్పుడు రగిలిన తీవ్ర వివాదం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. నెలల తరబడి కొనసాగిన రాజకీయ విభేదాలకు తెరపడుతూ ఇద్దరూ మళ్లీ మాట్లాడుకుంటున్నారు. తాజాగా చైనాకు వెళ్లే విమానంలో ఇద్దరూ స్నేహపూర్వకంగా కనిపించడం ఈ మార్పుకు సంకేతంగా నిలిచింది.

**ఎన్నికల కోసం భారీ సాయం**

అమెరికా నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు మద్దతుగా మస్క్ భారీ మొత్తాన్ని ఖర్చు చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ట్రంప్ అనుకూల రాజకీయ కార్యక్రమాల కోసం కనీసం 100 మిలియన్ డాలర్లు ఖర్చు చేసే అవకాశం ఉంది. కీలక రాష్ట్రాల్లో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా ఈ నిధులను వినియోగించనున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయానికి మస్క్ భారీగా మద్దతిచ్చారు. దాదాపు 300 మిలియన్ డాలర్లు ఖర్చు చేసి ట్రంప్ ప్రచారానికి అండగా నిలిచారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత మస్క్ వైట్‌హౌస్‌కు దగ్గరగా పనిచేశారు. DOGE ద్వారా ప్రభుత్వ ఖర్చులు తగ్గించే కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు.

**ఒక్కసారిగా రాజకీయ వైరం**

అయితే ఈ సాన్నిహిత్యం ఎక్కువ కాలం నిలవలేదు. మస్క్ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించడం మొదలుపెట్టారు. ట్రంప్ తీసుకొచ్చిన పన్నులు, ఖర్చులకు సంబంధించిన బిల్లును మస్క్ తీవ్రంగా వ్యతిరేకించారు. ట్రంప్ ఎన్నికల్లో గెలవడానికి తన సహాయం కీలకమని కూడా మస్క్ బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. వివాదం తీవ్రంగా ఉన్న సమయంలో మస్క్ సోషల్ మీడియాలో ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన ఫైళ్లలో ట్రంప్ పేరు ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై ట్రంప్ తీవ్రంగా స్పందించి మస్క్ కంపెనీల



ప్రభుత్వ ఒప్పందాలను రద్దు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి.

**తెరవెనుక రాజీ ప్రయత్నాలు**

అయితే ఈ విభేదాలు శాశ్వతంగా కొనసాగకుండా వైట్‌హౌస్ వర్గాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా పలువురు నేతలు మస్క్‌తో సంబంధాలను కొనసాగించారు. మస్క్ కూడా కొన్ని వ్యాఖ్యల విషయంలో తాను హద్దు దాటినట్లు అంగీకరించారు. స్పేస్‌ఎక్స్‌కు అమెరికా రక్షణ రంగం, నాసాతో ఉన్న కీలక ఒప్పందాలు కూడా ఈ సంబంధాన్ని పూర్తిగా తెంచుకోవడం కష్టతరం చేశాయి. మస్క్ రాజకీయ పార్టీ ఏర్పాటు ఆలోచనను విరమించుకోవడం, జారెడ్ ఐజాక్‌మన్‌ను నాసా అధిపతిగా తిరిగి నియమించడం వంటి పరిణామాలు కూడా సంబంధాల మెరుగుదలకు దోహదపడ్డాయి. తరువాత ట్రంప్ విందుకు మస్క్ హాజరయ్యారు. ఇద్దరూ బహిరంగ కార్యక్రమాల్లో కనిపించడం మొదలైంది.


**నెలకోసారి కీలక చర్చలు**

ప్రస్తుతం ట్రంప్, మస్క్ దాదాపు నెలకోసారి మాట్లాడుకుంటున్నట్లు సమాచారం. కృత్రిమ మేధ, చైనా, ప్రపంచ పరిణామాలు వంటి అంశాలపై చర్చిస్తున్నారని తెలుస్తోంది. అయితే గతంలో ఉన్నంత సన్నిహిత సంబంధం మళ్లీ ఏర్పడుతుందని ట్రంప్ భావించడం లేదని ఆయన సన్నిహితులకు చెప్పినట్లు సమాచారం. మధ్యంతర ఎన్నికల్లో మస్క్ మళ్లీ అమెరికా పీఏసీ ద్వారా రిపబ్లికన్లకు మద్దతివ్వనున్నారు. అయితే గత ఎన్నికల మాదిరిగా రాజకీయాల్లో అతిగా జోక్యం చేసుకోబోనని మస్క్ సంకేతాలు ఇస్తున్నారు. గతంలో రాజకీయాల్లో తాను కొంత ఎక్కువగా మునిగిపోయానని స్వయంగా అంగీకరించిన మస్క్.. ఇప్పుడు మాత్రం 100 మిలియన్ డాలర్లతో పరిమితమైనా ప్రభావవంతమైన రాజకీయ పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు.

# కింగ్ నాగార్జునకు సైబర్ షాక్

### ఏడు గంటలు డిజిటల్ అరెస్ట్
### స్టార్ హీరోకూ తప్పని సైబర్ ముప్పు

సైబర్ నేరగాళ్లకు సామాన్యులు, సెలబ్రిటీలు అనే తేడా లేదని హీరో అక్కినేని నాగార్జున వెల్లడించారు. హైదరాబాద్‌లో జరిగిన 'సురక్ష కా తిరంగా' సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఐదేళ్ల క్రితం తనను బ్యాంకు అధికారిగా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసం చేసేందుకు ప్రయత్నించాడని తెలిపారు. అదే సమయంలో తన కుటుంబంలోని కొందరికి కూడా సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి, విదేశాలకు నార్కోటిక్ పదార్థాలు ఉన్న పార్సిల్ పంపారంటూ బెదిరించారని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులను దాదాపు 6 నుంచి 7 గంటల పాటు డిజిటల్ అరెస్ట్ తరహాలో భయాందోళనకు గురిచేశారని నాగార్జున వివరించారు. సైబర్ మోసాల నుంచి రక్షణ కోసం మొబైల్, వైఫై



పాస్‌వర్డ్‌లను తరచూ మారుస్తానని, వ్యక్తిగత ఫొటోలను ఫోన్‌లో భద్రపరచనని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణ సైబర్ పోలీసులు చేస్తున్న కృషిని ప్రశంసించిన నాగార్జున, సినీ పైరసీ నియంత్రణలోనూ పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ మోసం జరిగితే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# నేరాల స్వరూపం మారుతోంది

### సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ
### డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి

తెలంగాణలో నేరాల స్వరూపం వేగంగా మారుతోందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సైబర్ నేరాల బారినపడుతున్న వారిలో రిటైర్డ్ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ ఎక్కువగా ఉంటున్నారని చెప్పారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన 'సురక్ష కా తిరంగా' సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, వృద్ధులను కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో భౌతిక దోపిడీలు ఎక్కువగా ఉండగా ప్రస్తుతం నార్కోటిక్ నేరాలు, సైబర్ నేరాలు పెరుగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాల ప్రభావంతో విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ మోసాల బాధితులు ఫిర్యాదు చేసేందుకు కూడా వెనుకాడుతున్నారని చెప్పారు. తెలంగాణ పోలీసులు ఇప్పటివరకు 40 రకాల సైబర్ నేరాలను గుర్తించారని, వాటిలో ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ ఎక్కువగా ఉన్నాయని వివరించారు.






# దేశమంటే కులం కాదు.. జెన్ జీ!

## దేశమంటే మనుషులే.. జాతీయతకు కొత్త నిర్వచనం

## నేను నాదేశం.. ఎనభై వసంతాల స్వేచ్ఛా స్వాతంత్ర్యం



### దేశం ముందు.. జెన్ జీ ఒక పిలుపు

ఎన్నికలు వస్తాయి. ప్రభుత్వాలు మారతాయి. నాయకులు మారతారు. పార్టీలు గెలుస్తాయి. పార్టీలు ఓడిపోతాయి. కానీ దేశం మాత్రం కొనసాగుతుంది. అందుకే రాజకీయ పార్టీ కంటే దేశం పెద్దది. నాయకుడి కంటే రాజ్యాంగం పెద్దది. ఎన్నికల విజయం కంటే ప్రజల ఐక్యత పెద్దది. అధికార కుర్చీ కంటే పౌరుడి గౌరవం పెద్దది. ఈ ప్రాథమిక సత్యాన్ని మరచిపోతే రాజకీయాలు ప్రజాసేవ నుంచి అధికార పోరాటంగా మారిపోతాయి. దేశం మాత్రం రాజకీయ పార్టీల సొత్తు కాదు. అది ప్రతి పౌరుడి ఉమ్మడి బాధ్యత. ఈ తరం ముందున్న అవకాశం అసాధారణమైనది. సాంకేతికత చేతిలో ఉంది. ప్రపంచ జ్ఞానం అందుబాటులో ఉంది. కొత్త ఆలోచనలకు విస్తృత వేదిక ఉంది. ఉద్యోగం కోసం ప్రపంచాన్ని చేరుకోవచ్చు. వ్యాపారం కోసం ప్రపంచ మార్కెట్‌ను అందుకోవచ్చు. విజ్ఞానం కోసం ప్రపంచంలోని ఉత్తమ పరిశోధనలను చదవవచ్చు. సామాజిక సమస్యలను ప్రపంచం ముందు పెట్టవచ్చు. ఈ శక్తిని కేవలం వ్యక్తిగత విజయానికి

**భా**రతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవం వైపు అడుగులు వేస్తున్న ఈ సమయంలో మనం ఒక్కసారి ఆగి దేశం అంటే ఏమిటో ఆలోచించాలి. దేశం అంటే కేవలం ఒక భూభాగం కాదు. సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టే సైనికుడు, ఎండలో పొలాన్ని దున్నే రైతు, కర్మాగారంలో శ్రమించే కార్మికుడు, తరగతి గదిలో భవిష్యత్తును కలలు కనే విద్యార్థి, ప్రయోగశాలలో కొత్త ఆవిష్కరణ కోసం శ్రమించే శాస్త్రవేత్త, రోగిని కాపాడే వైద్యుడు, రోడ్డు నిర్మించే కార్మికుడు ఇవన్నీ కలిసిన సమష్టి రూపమే దేశం. దేశం అంటే మట్టికి ఉన్న సరిహద్దు మాత్రమే కాదు. ఆ సరిహద్దుల మధ్య గౌరవంగా జీవించే కోట్లాది మనుషుల జీవితం. అలాంటి భారతదేశాన్ని కులం, మతం, ప్రాంతం, భాష పేర్లతో చిన్న చిన్న గీతలుగా విభజించడం దేశ భావనను బలహీనపరచడమే.

### గురజాడ మాటలకు నేటి అర్థం

"దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అన్న మహాకవి గురజాడ అప్పారావు మాటలు నేటికీ మన చెవుల్లో మారుమోగుతూనే ఉన్నాయి. శతాబ్దం క్రితం చెప్పిన ఆ మాటలు ఇప్పుడు మరింత అవసరంగా కనిపిస్తున్నాయి. ఎందుకంటే మనం సాంకేతికంగా ముందుకు వెళ్తున్న కొద్దీ సమాజంలో కొన్ని పాత గోడలు కొత్త రూపాల్లో కనిపిస్తున్నాయి. కులం ఆధారంగా మనిషిని కొలవడం, మతం ఆధారంగా అతని దేశభక్తిని అంచనా వేయడం, ప్రాంతం ఆధారంగా అతని సామర్థ్యాన్ని నిర్ణయించడం, భాష ఆధారంగా అతని వ్యక్తిత్వాన్ని తక్కువ చేయడం ఇవి ఆధునిక భారతదేశానికి సరిపడని ఆలోచనలు. దేశం ముందుకు వెళ్లాలంటే మొదట మనిషి గౌరవం ముందుకు వెళ్లాలి. స్వాతంత్ర్య దినోత్సవం వచ్చినప్పుడు మనం జాతీయ జెండాను గౌరవంగా ఎగురవేస్తాం. జాతీయ గీతాన్ని ఆలపిస్తాం. స్వాతంత్ర్య సమరయోధులను స్మరిస్తాం. అయితే జెండా కింద నిలబడే ప్రతి మనిషికి సమాన గౌరవం ఇవ్వడం కూడా అదే దేశభక్తిలో భాగమని గుర్తించాలి. ఒక పౌరుడికి ఉన్న హక్కు మరో పౌరుడికీ ఉండాలి. ఒకరి ప్రాణానికి ఉన్న విలువ మరొకరి ప్రాణానికీ ఉండాలి. ఒకరి కలలకు ఉన్న ప్రాధాన్యం మరొకరి కలలకూ ఉండాలి. జాతీయ పతాకం మనందరినీ ఒకే గుర్తింపుతో నిలబెడుతుంది. ఆ గుర్తింపు భారతీయుడు. దాని కంటే ముందు వచ్చే కులం, మతం, ప్రాంతం వంటి గుర్తింపులు వ్యక్తిగతమైనవి. భారతీయత మాత్రం సమష్టి గుర్తింపు.

### జెన్ జీకి కొత్త భారతం

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలు ఉండటం సహజం. సిద్ధాంతాల మధ్య పోటీ కూడా అవసరమే. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షం బాధ్యత. అధికారాన్ని సమర్థించడం అధికార పార్టీ బాధ్యత. కానీ ఈ రాజకీయ పోటీ ప్రజలను శాశ్వత శిబిరాలుగా విడదీయకూడదు. ఎన్నికల సమయంలో ఒక పార్టీకి ఓటు వేసిన వ్యక్తి మరొక పార్టీకి శత్రువు కాదు. అతను కూడా అదే దేశ పౌరుడు. రాజకీయ నాయకుడి అభిప్రాయాన్ని వ్యతిరేకించడం దేశాన్ని వ్యతిరేకించడం కాదు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించడం దేశద్రోహం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు బలహీనత కాదు. అది ప్రజాస్వామ్యానికి ప్రాణం. మన సమాజంలో కులం ఒక సామాజిక వాస్తవికత. మతం ఒక వ్యక్తిగత విశ్వాసం. ప్రాంతం ఒక భావోద్వేగ అనుబంధం. కానీ ఓటు విలువకు కులం ఉండకూడదు. రాజ్యాంగ హక్కులకు మతం ఉండకూడదు. ప్రభుత్వ సేవలకు ప్రాంతం అడ్డంకి కాకూడదు. ఉద్యోగానికి కుటుంబ పేరు ప్రమాణం కాకూడదు. ప్రతిభను మతంతో కొలవడం ఎంత తప్పో, పేదరికాన్ని కులంతో ముడిపెట్టి శాశ్వతంగా చూడటం కూడా అంతే తప్పు. ప్రజాస్వామ్యం మనిషిని ముందుగా పౌరుడిగా చూస్తుంది. అదే దృక్పథం సమాజంలో బలపడాలి. ఈ నేపథ్యంలో జెన్ జీ తరాన్ని ప్రత్యేకంగా చూడాలి. డిజిటల్ ప్రపంచంలో పుట్టి పెరిగిన ఈ తరం సమాచారాన్ని కేవలం ఒకే మూలం నుంచి స్వీకరించడం లేదు. ఒక వార్త చూస్తే మరో వార్త కోసం వెతుకుతుంది. ఒక నాయకుడు మాట్లాడితే ఆ మాటకు ఆధారం ఏమిటని ప్రశ్నిస్తుంది. ఒక సంఘటనను సోషల్ మీడియాలో చూస్తే దాని వెనుక ఉన్న వాస్తవాన్ని తెలుసుకోవాలనుకుంటుంది. ప్రపంచంలో ఎక్కడో జరిగిన సంఘటన కొన్ని నిమిషాల్లో వారి మొబైల్ తెరపై కనిపిస్తుంది. ఈ తరం ప్రపంచాన్ని దగ్గరగా చూస్తోంది. అందుకే పాత విభజనలను ప్రశ్నించే సామర్థ్యం కూడా ఈ తరంలో ఎక్కువగా ఉంది.

### దేశభక్తికి కొత్త అర్థం

జెన్ జీ అంటే కేవలం మొబైల్ ఫోన్ చేతిలో పట్టుకున్న తరం కాదు. సోషల్ మీడియా పోస్టులు పెట్టే తరం మాత్రమే కాదు. కొత్త ప్రశ్నలు అడిగే తరం. పాత సమాధానాలను పరిశీలించే తరం. తాను నమ్మిన విషయాన్ని కూడా అవసరమైతే తిరిగి పరిశీలించే తరం. ప్రపంచంలో జరుగుతున్న మార్పులను వేగంగా స్వీకరించే తరం. ఒకప్పుడు సమాచారం కోసం గ్రంథాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సమాచారం క్షణాల్లో అందుబాటులో ఉంది. అందుకే ఈ తరానికి అబద్ధాన్ని నిజంగా నమ్మించడం అంత సులభం కాదు. అయితే సమాచారం ఎక్కువగా ఉండటం జ్ఞానం పెరిగిందనే అర్థం కాదు. నిజాన్ని గుర్తించే బాధ్యత కూడా ఈ తరంపైనే ఉంది. దేశభక్తి అంటే కేవలం జాతీయ జెండా పట్టుకోవడం కాదు. దేశం బాగుండాలని కోరుకోవడం. మంచి విద్య అందరికీ అందాలని కోరుకోవడం. యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగాలని ఆశించడం. రైతుకు న్యాయమైన ఆదాయం రావాలని కోరుకోవడం. మహిళలు భయంలేకుండా రోడ్లపై తిరగగలగాలని కోరుకోవడం. అవినీతి తగ్గాలని కోరుకోవడం. పర్యావరణాన్ని కాపాడాలని భావించడం. పేద పిల్లలకు కూడా మంచి విద్య అందాలని కోరుకోవడం. శాస్త్ర విజ్ఞానం పెరగాలని కోరుకోవడం. ఇవన్నీ దేశభక్తి రూపాలే. దేశం కోసం ప్రాణత్యాగం చేసే సైనికుడి సేవ ఎంత గొప్పదో, నిజాయితీగా తన బాధ్యత నిర్వర్తించే పౌరుడి సేవ కూడా అంతే విలువైనది.

### భిన్నాభిప్రాయం శత్రుత్వం కాదు

నేటి రాజకీయ నాయకత్వం యువతలో వస్తున్న మార్పును అర్థం చేసుకోవాలి. యువతను కేవలం సభల్లో నినాదాలు చేసే జనంగా చూడకూడదు. ఎన్నికల సమయంలో ప్రచారానికి ఉపయోగించే శక్తిగా చూడకూడదు. పోస్టర్లు అంటించే చేతులుగా చూడకూడదు. ర్యాలీల్లో కనిపించే ముఖాలుగా చూడకూడదు. దేశ నిర్మాణంలో భాగస్వాములుగా చూడాలి. యువత ప్రశ్నిస్తే చిరాకు పడకూడదు. ప్రశ్నకు సమాధానం లేకపోతే నిజాయితీగా చెప్పాలి. తప్పు జరిగితే అంగీకరించాలి. ప్రజాస్వామ్యంలో నాయకత్వం అంటే కేవలం మాట్లాడటం కాదు. వినడం కూడా. మన దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత పెద్ద బలం భిన్నాభిప్రాయాలు. ఒకే విషయంపై పది మంది పది రకాలుగా ఆలోచించవచ్చు. ఒకే సమస్యకు వేర్వేరు పరిష్కారాలు సూచించవచ్చు. అది ప్రజాస్వామ్య సహజ స్వభావం. కానీ అభిప్రాయం వేరు అని మనిషిని శత్రువుగా చూడటం ప్రమాదకరం. రాజకీయ విభేదం వ్యక్తిగత ద్వేషంగా మారినప్పుడు సమాజంలో గోడలు పెరుగుతాయి. ఒక పార్టీకి మద్దతు ఇచ్చేవాడు చెడ్డవాడు కాదు. మరో పార్టీకి మద్దతు ఇచ్చేవాడు దేశద్రోహి కాదు. ఎన్నికల ఫలితం మన అభిప్రాయానికి అనుకూలంగా రాకపోతే ప్రజలను తక్కువ చేయడం ప్రజాస్వామ్యాన్ని తక్కువ చేయడమే.

### రాజ్యాంగమే సమానత్వానికి పునాది

భారత రాజ్యాంగం మనకు అనేక హక్కులు ఇచ్చింది. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను మన ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలిపింది. అయితే హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉన్నాయి. మనకు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. ఎదుటివారిని గౌరవించే బాధ్యత కూడా ఉంది. మనకు అభిప్రాయం చెప్పే హక్కు ఉంది. భిన్నాభిప్రాయాన్ని సహించే బాధ్యత కూడా ఉంది. మనకు మత స్వేచ్ఛ ఉంది. మరో మతాన్ని గౌరవించే బాధ్యత కూడా ఉంది. మనకు ఓటు హక్కు ఉంది. సమాజ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాల్సిన బాధ్యత కూడా ఉంది. దేశం మనకు ఏమిచ్చిందని అడిగే ముందు దేశానికి మనం ఏమిచ్చామో ఆలోచించాలి. పన్నులు చెల్లించడం నుంచి ప్రజా ఆస్తిని కాపాడటం వరకు ప్రతి చిన్న పని దేశ నిర్మాణంలో భాగమే. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కూడా దేశ బాధ్యత. చెత్తను రోడ్లపై వేయకుండా ఉండటం కూడా దేశ సేవే. నీటిని వృథా చేయకుండా చూడటం కూడా దేశ సేవే. పర్యావరణాన్ని కాపాడటం కూడా దేశభక్తే. బలహీనుడికి సహాయం చేయడం కూడా భారతీయతే. ఒక పౌరుడి మంచి ప్రవర్తన దేశ ప్రతిష్ఠను పెంచుతుంది.

### రేపటి భారతం మొబైల్‌లో ఉన్న శక్తి

భారతదేశ భవిష్యత్తు కేవలం పార్లమెంట్ భవనంలో నిర్ణయించబడదు. అది తరగతి గదిలో మొదలవుతుంది. ప్రయోగశాలలో రూపుదిద్దుకుంటుంది. స్టార్టప్ కార్యాలయంలో కొత్త ఆలోచనగా పుడుతుంది. పొలంలో రైతు శ్రమతో బలపడుతుంది. కర్మాగారంలో కార్మికుడి చెమటతో ఎదుగుతుంది. సరిహద్దులో సైనికుడి అప్రమత్తతతో సురక్షితమవుతుంది. ఆసుపత్రిలో వైద్యుడి సేవతో మానవత్వాన్ని పొందుతుంది. గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుడి బోధనతో భవిష్యత్తును నిర్మించుకుంటుంది. ముఖ్యంగా యువత ఆలోచనల్లో రేపటి భారతం రూపుదిద్దుకుంటుంది. జెన్ జీ చేతిలోని మొబైల్ ఒక వినోద సాధనం మాత్రమే కాదు. అది ఒక శక్తివంతమైన కమ్యూనికేషన్ సాధనం. ఒక అన్యాయం జరిగితే దాన్ని ప్రపంచం ముందు తీసుకురాగలదు. ఒక మంచి ఆలోచనను లక్షల మందికి చేరవేయగలదు. ఒక సామాజిక సమస్యపై చర్చ మొదలుపెట్టగలదు. ఒక యువకుడి ప్రతిభకు ప్రపంచ మార్కెట్ తెరవగలదు. అయితే అదే మొబైల్ అబద్ధాలను వ్యాప్తి చేసే ఆయుధంగా కూడా మారవచ్చు. అందుకే డిజిటల్ స్వేచ్ఛకు డిజిటల్ బాధ్యత కూడా అవసరం. నిజం తెలుసుకోకుండా పంచే సమాచారం సమాజానికి నష్టం చేస్తుంది.

### యువ ఓటు దేశ భవిష్యత్తు

యువత చేతిలో ఉన్న మరో గొప్ప శక్తి ఓటు. ఓటు ఒక రాజకీయ పార్టీకి ఇచ్చే మద్దతు మాత్రమే కాదు. దేశ భవిష్యత్తుపై పౌరుడి సంతకం. అభ్యర్థి కులం ఏంటి అనే ప్రశ్న కంటే అతని సామర్థ్యం ఏంటి అనేది ముఖ్యం. అతని మతం ఏంటి అనే ప్రశ్న కంటే ప్రజల కోసం ఏమి చేశాడు అనేది ముఖ్యం. అతని పార్టీ గుర్తు కంటే అతని విధానం ఏంటి అనేది ముఖ్యం. ఎన్నికల సమయంలో డబ్బు, ప్రలోభాలు, భావోద్వేగాలు ఓటును ప్రభావితం చేయకుండా ప్రశ్నించే ఓటరు ఎదిగితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. జెన్ జీ గతాన్ని పూర్తిగా తిరస్కరించాల్సిన అవసరం లేదు. గత తరాలు సాధించిన విజయాలను గుర్తుంచుకోవాలి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గౌరవించాలి. రాజ్యాంగ నిర్మాతల ఆలోచనలను అర్థం చేసుకోవాలి. కుటుంబం నుంచి వచ్చిన విలువలను స్వీకరించాలి. అదే సమయంలో గతంలో ఉన్న అన్యాయాలను ప్రశ్నించాలి. కుల వివక్షను తిరస్కరించాలి. మత ద్వేషాన్ని తిరస్కరించాలి. మహిళలపై వివక్షను తిరస్కరించాలి. పేదరికాన్ని శాశ్వత విధిగా చూడకూడదు. సంప్రదాయాన్ని గౌరవించడం అంటే ప్రతి పాత ఆలోచనను అంగీకరించడం కాదు. మంచిని తీసుకుని చెడును మార్చడం.

### రాజకీయాలకు ఒక హెచ్చరిక

భారతదేశ ప్రత్యేకత దాని భిన్నత్వంలో ఉంది. ఒకే దేశంలో ఎన్నో భాషలు, ఎన్నో మతాలు, ఎన్నో సంప్రదాయాలు, ఎన్నో పండుగలు ఉన్నాయి. ఒకరి పండుగను మరొకరు గౌరవించినప్పుడు భారతీయత బలపడుతుంది. ఒకరి ప్రార్థనా స్థలాన్ని మరొకరు గౌరవించినప్పుడు సౌభ్రాతృత్వం పెరుగుతుంది. ఒకరి ఆహారపు అలవాట్లను మరొకరు గౌరవించినప్పుడు సహనం పెరుగుతుంది. మనకు నచ్చని జీవన విధానాన్ని కూడా మరొకరి హక్కుగా అంగీకరించడం ఆధునిక ప్రజాస్వామ్య లక్షణం. భిన్నత్వం మన బలహీనత కాదు. అదే మన దేశపు అసలైన బలం. కులాన్ని ఓటు బ్యాంకుగా చూడటం, మతాన్ని ఎన్నికల ఆయుధంగా ఉపయోగించడం, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టడం, భిన్నాభిప్రాయాలను దేశద్రోహంగా ముద్రించడం ఇవి తాత్కాలిక రాజకీయ లాభాలను ఇవ్వొచ్చు. కానీ దీర్ఘకాలంలో సమాజాన్ని బలహీనపరుస్తాయి. రాజకీయ నాయకత్వం ప్రజలను భయపెట్టడం ద్వారా కాకుండా నమ్మకం కల్పించడం ద్వారా ఎదగాలి. యువతను రెచ్చగొట్టడం సులభం. కానీ యువతకు దిశ చూపడం నాయకత్వం. ఓటు కోసం సమాజాన్ని విడదీయడం సులభం. దేశం కోసం సమాజాన్ని కలపడం గొప్ప నాయకత్వం.

### ఎనభై ఏళ్ల స్వాతంత్ర్యానికి నిజమైన గౌరవం

దేశ నిర్మాణం అంటే ఎప్పుడూ గొప్ప కార్యక్రమాలు చేయాల్సిన అవసరం లేదు. ఒక చిన్నారి చదువుకు సహాయం చేయడం కూడా దేశ నిర్మాణమే. ఒక మొక్కను నాటడం కూడా దేశ నిర్మాణమే. రక్తదానం చేయడం కూడా దేశ సేవే. రోడ్డుపై ప్రమాదంలో ఉన్నవారికి సహాయం చేయడం కూడా మానవత్వమే. అవినీతికి లొంగకుండా ఉండటం కూడా దేశభక్తే. తప్పు కనిపించినప్పుడు ధైర్యంగా ప్రశ్నించడం కూడా ప్రజాస్వామ్య సేవే. మన చుట్టూ ఉన్న పది మందిని గౌరవంగా చూడటం కూడా దేశాన్ని బలపరుస్తుంది. మార్పు ఎప్పుడూ పెద్ద నినాదంతో మొదలవదు. ఒక మంచి ఆలోచనతో మొదలవుతుంది. 80 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని జరుపుకోవడం అంటే కేవలం వేడుకలు నిర్వహించడం కాదు. స్వాతంత్ర్యం మనకు ఇచ్చిన విలువలను కాపాడటం. భయంలేకుండా మాట్లాడే హక్కును కాపాడటం. సమానత్వాన్ని కాపాడటం. మత స్వేచ్ఛను కాపాడటం. మహిళల గౌరవాన్ని కాపాడటం. బలహీన వర్గాల హక్కులను కాపాడటం. యువత కలలకు అవకాశాలు కల్పించడం. రైతు, కార్మికుడు, విద్యార్థి, ఉద్యోగి, వ్యాపారి, సైనికుడు ప్రతి ఒక్కరి గౌరవాన్ని కాపాడటం. అదే స్వాతంత్ర్యానికి నిజమైన నివాళి.

### స్వేచ్ఛకు సార్థకత మన చేతుల్లోనే

ఎనభై ఏళ్ల స్వాతంత్ర్య ప్రయాణం భారతదేశానికి అపారమైన వారసత్వాన్ని అందించింది. ఆ వారసత్వాన్ని కాపాడుతూ కాలానుగుణంగా కొత్త విలువలను జోడించాల్సిన బాధ్యత ఇప్పుడు మనపై ఉంది. స్వేచ్ఛ అంటే కేవలం విదేశీ పాలన నుంచి విముక్తి కాదు; ప్రతి పౌరుడు గౌరవంతో జీవించే అవకాశం. ప్రతి యువకుడు తన ప్రతిభను నిరూపించుకునే వేదిక. ప్రతి మహిళ భద్రంగా అడుగులు వేసే సమాజం. ప్రతి రైతు, కార్మికుడు, విద్యార్థి తన శ్రమకు తగిన గౌరవం పొందే వ్యవస్థ. రాజకీయాలు మారవచ్చు. పాలకులు మారవచ్చు. సాంకేతికత రూపం మార్చుకోవచ్చు. కానీ ప్రజాస్వామ్య విలువలు నిలకడగా ఉండాలి. వాటిని బలపరిచే బాధ్యత ముఖ్యంగా కొత్త తరంపై ఉంది. జెన్ జీ చేతిలో ఉన్న విజ్ఞానం, సాంకేతికత, ఓటు హక్కు దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తులు. ఆ శక్తిని వివాదాల కోసం కాకుండా అభివృద్ధి కోసం వినియోగించాలి. ప్రశ్నించే స్వభావాన్ని బాధ్యతతో జోడించాలి. స్వేచ్ఛను విచక్షణతో ఉపయోగించాలి. భారతదేశం ముందుకు సాగాలంటే అవకాశాలు అందరికీ చేరాలి. ప్రతిభకు ప్రాధాన్యం దక్కాలి. చట్టం ముందు సమానత్వం నిలవాలి. భిన్నత్వం గౌరవించబడాలి. ఇదే నిజమైన దేశభక్తి.



# తెలంగాణ ఉద్యమ జ్వాల.. శ్రీకాంతాచారి

నేడు మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి జయంతి

## 'జై తెలంగాణ' నినాదంతో ఆత్మత్యాగం

ఆయన బలిదానంతో ఉవ్వెత్తున ఎగిసిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం

## తెలంగాణ చరిత్రలో చెరగని త్యాగమూర్తి

**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన మలిదశ ఉద్యమ చరిత్రలో కాసోజు శ్రీకాంతాచారి పేరు చెరగని అక్షరాలతో నిలిచిపోయింది. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కోసం ప్రాణాలను సైతం తృణప్రాయంగా భావించిన ఆయన మలిదశ తెలంగాణ ఉద్యమ తొలి అమరుడిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఆగస్టు 15 శ్రీకాంతాచారి జయంతి సందర్భంగా ఆయన త్యాగాన్ని తెలంగాణ సమాజం మరోసారి స్మరించుకుంటోంది.**

నల్గొండ జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన కాసోజు వెంకటచారి, శంకరమ్మ దంపతుల పెద్ద కుమారుడిగా 1986 ఆగస్టు 15న శ్రీకాంతాచారి జన్మించారు. సాధారణ కుటుంబంలో పుట్టిన ఆయన చిన్ననాటి నుంచే చురుకుగా ఉండేవారు. సమాజ సేవలో ముందుండటంతోపాటు తన వద్ద ఉన్నదానిలో ఇతరులకు సాయం చేసే స్వభావం కలిగి ఉండేవారు. స్థానికంగా ప్రాథమిక విద్య పూర్తిచేసి మోత్కూరు, నకిరేకల్ ప్రాంతాల్లో చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత రాజకీయ, విద్యార్థి ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. తొలుత బీజేపీలో, అనంతరం టీఆర్ఎస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా జరిగిన ఉద్యమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

### తెలంగాణే ఊపిరిగా..

శ్రీకాంతాచారి నిత్యం తెలంగాణ గురించే ఆలోచించేవారని సన్నిహితులు గుర్తుచేసుకుంటారు. తెలంగాణ పాటలు పాడటం, నినాదాలు చేయడం, కవితలు రాయడం ఆయన జీవితంలో భాగమయ్యాయి. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఆయనలో బలంగా నాటుకుపోయింది. 2009లో తెలంగాణ ఉద్యమం కీలక మలుపు తిరిగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష, అనంతరం చోటుచేసుకున్న అరెస్టులు, ఉద్యమకారులపై పోలీసుల చర్యలు శ్రీకాంతాచారిని తీవ్రంగా కలచివేశాయి. 2009 నవంబరు 29న హైదరాబాద్ ఎల్బీనగర్ చౌరస్తాలో జరిగిన నిరసన సందర్భంగా శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. మంటల్లో చిక్కుకున్న సమయంలోనూ 'జై తెలంగాణ' అంటూ నినదించిన ఘటన ఉద్యమకారులను కదిలించింది. తీవ్ర కాలిన గాయాలతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ఆయన ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాడారు. చివరకు 2009 డిసెంబర్ 3 రాత్రి తుదిశ్వాస విడిచారు.

### త్యాగంతో రగిలిన ఉద్యమం

శ్రీకాంతాచారి ఆత్మత్యాగం తెలంగాణ ఉద్యమాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. ఆయన మరణవార్తతో తెలంగాణ ప్రాంతంలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజాసంఘాల్లో ఉద్యమావేశం మరింత పెరిగింది. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన త్యాగం ఒక కీలక జ్ఞాపకంగా నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా శ్రీకాంతాచారి పేరు ఉద్యమ త్యాగానికి ప్రతీకగా వినిపిస్తూనే ఉంది. రాష్ట్ర సాధన చరిత్రను చెప్పుకునే ప్రతిసారీ ఆయన బలిదానం గుర్తుకొస్తుంది. ఆగస్టు 15 దేశానికి స్వాతంత్ర్య దినోత్సవం... అదే రోజు తెలంగాణ ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన శ్రీకాంతాచారి జన్మదినం. ఆయన జీవితం చిన్నదే అయినా.. తెలంగాణ కోసం చేసిన త్యాగం మాత్రం తరతరాలకు గుర్తుండిపోతుంది.



# స్వాతంత్ర్య సంబరాలకు మహాత్ముడు ఎందుకు దూరం?


## దేశమంతా పండుగ.. గాంధీ మనసంతా విభజన వేదన

ఢిల్లీలో స్వేచ్ఛా సంబరాలు.. బెంగాల్‌లో శాంతి కోసం మహాత్ముడి ప్రయత్నం

హిందూ-ముస్లిం రక్తపాతం మధ్య వేడుకలకు ఎలా రావాలన్న గాంధీ

దేశ విభజన కలచివేయడంతో ప్రార్థన, ఉపవాసంతో గడిపిన స్వాతంత్ర్య దినం

1947 ఆగస్టు 15న చరిత్రలో నిలిచిపోయిన మహాత్ముడి మౌనం



రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలనకు తెరపడింది. దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం ఫలించింది. 1947 ఆగస్టు 15న భారతావని స్వేచ్ఛావాయువులు పీల్చుకుంది. దేశమంతా ఆనందోత్సాహాలతో ఉప్పొంగింది. ఢిల్లీలో చారిత్రక వేడుకలు జరిగాయి. కానీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచడంలో కీలకపాత్ర పోషించిన మహాత్మా గాంధీ మాత్రం ఆ సంబరాల్లో కనిపించలేదు. దేశమంతా పండుగ చేసుకుంటున్న వేళ ఆయన ఎందుకు దూరంగా ఉన్నారన్నది చరిత్రలో ఆసక్తికరమైన, అంతకుమించి విషాదకరమైన అధ్యాయం. దేశ విభజనను చివరి వరకు వ్యతిరేకించిన గాంధీకి స్వాతంత్ర్యంతోపాటు భారత్ రెండు ముక్కలు కావడం తీవ్ర వేదన కలిగించింది. హిందువులు, ముస్లింల మధ్య ఐక్యతతో కూడిన భారతదేశాన్నే ఆయన కోరుకున్నారు. విభజనను నివారించేందుకు మహమ్మద్ అలీ జిన్నాకు ప్రభుత్వ నాయకత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాన్ని కూడా పరిశీలించాలని గాంధీ సూచించిన సందర్భాలున్నాయి. కానీ అప్పటికే రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. కాంగ్రెస్, ముస్లిం లీగ్, బ్రిటిష్ పాలకుల మధ్య జరిగిన పరిణామాలు చివరకు విభజనకు దారితీశాయి.

### ఢిల్లీలో ఆనందం.. బెంగాల్‌లో రక్తపాతం

స్వాతంత్ర్యం సమీపిస్తున్న సమయంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో మత ఘర్షణలు చెలరేగాయి. ముఖ్యంగా బెంగాల్, పంజాబ్ ప్రాంతాల్లో పరిస్థితులు తీవ్రంగా మారాయి. హిందువులు, ముస్లింల మధ్య హింసను నిలువరించడమే తన ముందున్న అతిపెద్ద బాధ్యతగా గాంధీ భావించారు. 1946 నుంచే ఆయన బెంగాల్, బీహార్ తదితర హింస ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. వృద్ధాప్యాన్ని కూడా లెక్కచేయకుండా గ్రామాలు తిరిగి హిందూ, ముస్లిం వర్గాలతో మాట్లాడారు. ప్రతీకారం సమస్యకు పరిష్కారం కాదని, మతసామరస్యమే దేశాన్ని నిలబెడుతుందని నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. 1947 ఆగస్టు నాటికి ఆయన కలకత్తాలోని బెలియాఘాటాలో ఉన్నారు. దేశ రాజధానిలో స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు జరుగుతుంటే గాంధీ మాత్రం మతహింసను ఆపేందుకు ప్రజల మధ్యే ఉండిపోయారు.

### ఇక్కడ మనుషులు చస్తుంటే..

తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గాంధీ హాజరుకావాలని కాంగ్రెస్ నాయకులు కోరుకున్నారు. కానీ ఆయన ప్రాధాన్యం వేడుకలకంటే మతహింసను నిలువరించడానికే ఇచ్చారు. హిందూ, ముస్లింలు పరస్పరం ప్రాణాలు తీసుకుంటున్న సమయంలో తాను సంబరాల్లో ఎలా పాల్గొనగలనన్న భావనతో ఢిల్లీకి వెళ్లలేదు. పత్రికలు స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా సందేశం కోరినా గాంధీ ఉత్సాహభరితమైన సందేశం ఇచ్చేందుకు సిద్ధపడలేదు. స్వేచ్ఛ వచ్చిన ఆనందం ఉన్నప్పటికీ దేశ విభజన, మతహింస ఆయనను తీవ్రంగా కలచివేశాయి.

### దేశం మేల్కొన్న వేళ..

1947 ఆగస్టు 14 అర్ధరాత్రి ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రక 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగం చేశారు. కొత్త భారతదేశం ఆవిర్భావాన్ని ప్రపంచానికి ప్రకటించారు. దేశమంతా ఆ చారిత్రక క్షణాన్ని ఆసక్తిగా వీక్షించింది. కానీ గాంధీ మాత్రం ఢిల్లీ వెలుగులకు దూరంగా ఉన్నారు. స్వాతంత్ర్య దినాన్ని ఆయన ప్రార్థన, ఉపవాసం, శాంతి ప్రయత్నాలతో గడిపారు. ఆయన దృష్టిలో బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే స్వాతంత్ర్యం కాదు. హిందువులు, ముస్లింలు సోదరభావంతో జీవించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థముంటుంది.

### వేడుకలకంటే మనుషుల ప్రాణాలే ముఖ్యం

తాను జీవితాంతం అహింసను ఆయుధంగా చేసుకుని పోరాడిన దేశంలోనే స్వాతంత్ర్యం వచ్చే సమయంలో మతం పేరుతో మనుషులు ఒకరినొకరు చంపుకోవడం గాంధీని తీవ్రంగా బాధించింది. అందుకే ఢిల్లీలో జరిగే అధికారిక సంబరాల కంటే హింసతో అట్టుడుకుతున్న ప్రాంతంలో ఉండటానికే ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. అందుకే 1947 ఆగస్టు 15 భారత చరిత్రలో రెండు భిన్న దృశ్యాలను మిగిల్చింది. ఢిల్లీలో స్వాతంత్ర్యపు వెలుగులు వెలిగితే.. బెంగాల్‌లో మతసామరస్యం కోసం మహాత్ముడు నడిచారు. దేశం స్వేచ్ఛను వేడుకగా జరుపుకుంటే.. గాంధీ మాత్రం విభజన గాయాలకు మందు వేసే ప్రయత్నంలో ఉన్నారు. **అదే తొలి స్వాతంత్ర్య దినోత్సవానికి మహాత్ముడు దూరంగా ఉండటానికి అసలు కారణం.**

# సీనియర్ జర్నలిస్ట్ ఆత్రం తుకారాం అస్తమయం

## తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన జర్నలిస్ట్ సంఘాల నాయకులు

నేడు సిర్పూర్ (యూ)లో అంత్యక్రియలు





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల 'నమస్తే తెలంగాణ' విలేఖరి, సీనియర్ ఆదివాసీ జర్నలిస్ట్ ఆత్రం తుకారామ్ (45) శుక్రవారం రాత్రి హఠాత్తుగా మరణించారు. కుటుంబీకులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్ (యూ) మండలానికి చెందిన తుకారామ్ శుక్రవారం రాత్రి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన చికిత్స కోసం సిర్పూర్ యూ నుండి కుటుంబ సభ్యులు ఆయనను ఆదిలాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించి కన్నుమూశారు.

### సుదీర్ఘ పాత్రికేయ సేవలు..

ఆత్రం తుకారామ్ 2000వ సంవత్సరంలో 'వార్త' తెలుగు దినపత్రిక ద్వారా జర్నలిస్టుగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఏజెన్సీ ప్రాంత ప్రజా సమస్యలపై నిరంతరం కలం పట్టి సమాజాన్ని చైతన్యపరిచారు. మారుమూల గ్రామాల సమస్యలు, ఆదివాసీల హక్కుల సాధన, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ఆయన రాసిన పలు కథనాలు పాలకులను సైతం కదిలించాయి. జొడేన్‌ఘాట్ చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రపంచానికి చాటడంలో ఆయన కథనాలు ప్రముఖ పాత్ర పోషించాయి. ప్రస్తుతం కెరమెరి 'నమస్తే తెలంగాణ' విలేఖరిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న తుకారామ్, జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలు అందిస్తున్నారు.

### జర్నలిస్ట్ సంఘాల సానుభూతి

తుకారామ్ అకాల మరణం పట్ల జిల్లాలోని జర్నలిస్టు లోకం, ఆదివాసీ సంఘాల నాయకులు, ఇతర సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తుకారం మృతి తీరని లోటు అని పేర్కొన్నారు.

### నేడు అంత్యక్రియలు

తుకారామ్ భౌతికకాయానికి శనివారం ఆయన స్వగ్రామమైన సిర్పూర్ (యూ) లో అంత్యక్రియలు మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై తుకారామ్‌కు నివాళులర్పించాలని జర్నలిస్టు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

### తుకారం మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటు

కెరమెరి విలేఖరి తుకారామ్ హఠాన్మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారంలో వారి పాత్ర, జర్నలిజానికి వారు అందించిన సేవలు మరవరానివి. ఆయన మృతి ఏజెన్సీ ప్రాంత జర్నలిస్టులకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, కుటుంబ సభ్యులకు నా గాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- అబ్దుల్ రహమాన్, జిల్లా అధ్యక్షుడు , టియుడబ్ల్యూజే (ఐజేయు) , ఆసిఫాబాద్

### జర్నలిజంలో తుకారాం సేవలు చిరస్మరణీయం

ఆదివాసీ సమాజం కోసం, కొమరం భీమ్ పోరాట పటిమను చాటుతూ తుకారామ్ రాసిన ప్రతి కథనం చిరస్మరణీయం. ఆయన లేని లోటు ఏజెన్సీ జర్నలిజానికి తీర్చలేనిది. అమరుడైన కొమరం భీమ్ వారసుడిగా ఆయన చూపిన బాట అందరికీ మార్గదర్శకం. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

- రవి నాయక్ , జిల్లా కన్వీనర్, టియుడబ్ల్యూజే ఎ-143:

# తొలి టెస్టు టీమ్‌లో బిగ్ సర్‌ప్రైజ్



## సీనియర్‌కు నో ప్లేస్, కొత్త కుర్రాడు అరంగేట్రం!

**గాలే, ఆగస్టు 14:** శ్రీలంకతో శనివారం నుంచి గాలే వేదికగా ప్రారంభం కానున్న తొలి టెస్టుకు టీమిండియా తుది జట్టు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి అందరిలో పెరిగింది. ఈ క్రమంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన ప్లేయింగ్ ఎలెవన్‌ను వెల్లడించాడు. అయితే యాష్ జట్టులో ఊహించని మార్పులు ఉన్నాయి. ముఖ్యంగా సీనియర్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణను అశ్విన్ తుది జట్టులోకి తీసుకోకపోవడం అందరి షాక్‌కు గురిచేసింది. సాయి సుదర్శన్ గాయం కారణంగా సర్ఫరాజ్ ఖాన్ తిరిగి భారత టెస్టు జట్టులోకి వచ్చాడు. దీంతో నంబర్-6 స్థానంపై ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ మధ్య పోటీ నెలకొంది. అయితే అశ్విన్ మాత్రం సర్ఫరాజ్ కంటే జురెల్‌నే ఎంపిక చేశాడు. ఉపఖండ పరిస్థితుల్లో సర్ఫరాజ్‌కు ఉన్న అనుభవం, స్పిన్‌ను ఎదుర్కొనే నైపుణ్యం ఉన్నప్పటికీ.. తుది జట్టులో జురెల్‌కు ప్రాధాన్యం ఇచ్చాడు. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌ను ఆర్ అశ్విన్ ఎంచుకున్నాడు. మూడో స్థానంలో సాయి సుదర్శన్ స్థానాన్ని దేవదత్ పడిక్కల్‌తో భర్తీ చేశాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. రిషభ్ పంత్ ఐదో స్థానంలో వికెట్ కీపర్ బ్యాటర్‌గా ఆడనుండగా.. ధ్రువ్ జురెల్ ఆరో స్థానంలో స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దిగుతాడని అశ్విన్ చెప్పాడు. పంత్, జురెల్ ఇద్దరికీ యాష్ ఒకేసారి తుది జట్టులోకి చోటిచ్చాడు. సర్ఫరాజ్ ఖాన్ చాలా కాలం తర్వాత తిరిగి జట్టులోకి వచ్చినప్పటికీ.. తొలి టెస్టులో అతడికి చోటు ఇవ్వలేదు ఆర్ అశ్విన్. ధ్రువ్ జురెల్ ఇటీవలి ఫామ్‌పై ప్రశ్నలు ఉన్నప్పటికీ.. అతడి వికెట్ కీపింగ్ సామర్థ్యం, బ్యాటింగ్‌లో ఉన్న అవకాశాలను దృష్టిలో పెట్టుకుని జట్టులోకి తీసుకోవచ్చని చెప్పాడు. రవీంద్ర జడేజా, మానవ్ సుతార్‌లను స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లుగా.. కుల్దీప్ యాదవ్‌ను స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా ఎంపిక చేశాడు. గాలే పిచ్ టెస్ట్ మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉండటంతో ఈ కాంబినేషన్ వర్కౌట్ అవుతుందని అశ్విన్ భావించాడు. అశ్విన్ జట్టులో బిగ్ సర్‌ప్రైజ్ గుర్నూర్ బ్రార్ ఎంపిక. సీనియర్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణకు బదులుగా గుర్నూర్‌ను తుది జట్టులోకి తీసుకున్నాడు. శ్రీలంకతో జరిగే తొలి టెస్టులో గుర్నూర్ టెస్టు అరంగేట్రం చేయవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. మహ్మద్ సిరాజ్‌తో కలిసి గుర్నూర్ కొత్త బంతిని పంచుకోనున్నాడని చెప్పాడు. వార్మప్ మ్యాచ్‌లో తన వేగం, బౌన్స్‌తో శ్రీలంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన గుర్నూర్. తొలి టెస్టులో మరింత ప్రభావవంతంగా బౌలింగ్ చేస్తాడని యాష్ పేర్కొన్నాడు.

### అశ్విన్ ప్లేయింగ్ ఎలెవన్:

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, గుర్నూర్ బ్రార్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్.

# రూ.100కే ఫుట్‌బాల్ క్లబ్!

- జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీ వాటాల బదిలీకి టాటా స్టీల్ నిర్ణయం
- చర్చిల్ బ్రదర్స్‌తో కుదిరిన ఒప్పందం
- లైసెన్స్‌తోపాటు 12 మంది ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌ల కాంట్రాక్టులూ బదిలీ
- అనుమతులు వస్తే మళ్లీ అగ్రశ్రేణి లీగ్‌లోకి గోవా క్లబ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత ఫుట్‌బాల్‌లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాటా స్టీల్ యాజమాన్యంలోని జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీకి సంబంధించిన పూర్తి వాటాలను కేవలం రూ.100 టోకెన్ ధరకు గోవాకు చెందిన చర్చిల్ బ్రదర్స్‌కు బదిలీ చేసేందుకు టాటా స్టీల్ డైరెక్టర్ల కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఇరు యాజమాన్యాల మధ్య ఒప్పందం కుదిరింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నుంచి అవసరమైన అనుమతులు లభిస్తే 15 రోజుల్లో బదిలీ ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది. ఈ ఒప్పందంలో భాగంగా జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీకి ఉన్న అగ్రశ్రేణి లీగ్ స్పోర్టింగ్ లైసెన్స్‌తోపాటు 12 మంది ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌ల ఒప్పందాలు కూడా చర్చిల్ బ్రదర్స్‌కు బదిలీ కానున్నాయి. దీంతో చర్చిల్ బ్రదర్స్ తిరిగి దేశ అగ్రశ్రేణి ఫుట్‌బాల్ పోటీల్లో అడుగుపెట్టేందుకు మార్గం సుగమం కానుంది. క్లబ్ స్థాయి వృత్తిపరమైన ఫుట్‌బాల్ నుంచి వైదొలగాలని టాటా స్టీల్ నిర్ణయించుకోవడమే ఈ పరిణామానికి కారణంగా తెలుస్తోంది. ఇకపై టాటా ఫుట్‌బాల్ అకాడమీ ద్వారా క్షేత్రస్థాయి, యువజన ఫుట్‌బాల్ అభివృద్ధి, కొత్త ప్రతిభను వెలికితీయడంపై ప్రధానంగా దృష్టి సారించాలని సంస్థ భావిస్తోంది. మరోవైపు చర్చిల్ బ్రదర్స్‌కు ఈ ఒప్పందం కీలక అవకాశంగా మారింది. గతంలో ఐ-లీగ్‌లో సత్తాచాటిన ఆ క్లబ్‌కు పాయింట్ల వివాదం కారణంగా అగ్రశ్రేణి లీగ్‌కు పదోన్నతి దక్కలేదు. తాజాగా జమ్‌షెడ్‌పూర్ ఎఫ్‌సీ లైసెన్స్ బదిలీకి మార్గం సుగమం కావడంతో మరోసారి అగ్రస్థాయి భారత ఫుట్‌బాల్‌లో సత్తా చాటేందుకు చర్చిల్ బ్రదర్స్ సిద్ధమవుతోంది.

# కంగారూల గడ్డపై తంజిద్ గర్జన!

**ఆస్ట్రేలియాపై రికార్డు శతకంతో చెలరేగిన బంగ్లా ఓపెనర్**

**ఆసీస్‌పై టెస్టు సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా ఘనత**

**హసన్ మహమూద్ ఆరు వికెట్లు.. శాంటో 84 పరుగులు**

**రెండో రోజు ఆట ముగిసేసరికి 153 పరుగుల ఆధిక్యంలో బంగ్లాదేశ్**



**డార్విన్, ఆగస్టు 14:** ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ అదరగొడుతోంది. తొలి టెస్టులో ఆతిథ్య జట్టును తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూల్చిన బంగ్లా.. బ్యాటింగ్‌లోనూ సత్తాచాటి మ్యాచ్‌పై పట్టుబిగించింది. ఓపెనర్ తంజిద్ హసన్ తమీమ్ 101 పరుగులతో రికార్డు శతకం సాధించగా, కెప్టెన్ నజ్ముల్ హుస్సేన్ శాంటో 84 పరుగులతో రాణించాడు. 23 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు ఆడుతున్న బంగ్లాదేశ్‌కు తంజిద్ చిరస్మరణీయ ఇన్నింగ్స్ అందించాడు. [illegible] హేజిల్‌వుడ్ వంటి [illegible] ఎదుర్కొని సెంచరీ పూర్తి చేశాడు. దీంతో ఆస్ట్రేలియాపై టెస్టుల్లో శతకం సాధించిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా తంజిద్ రికార్డు సృష్టించాడు. అంతకుముందు హసన్ మహమూద్ 55 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. అనంతరం తంజిద్, శాంటో కీలక భాగస్వామ్యంతో బంగ్లాదేశ్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. చివర్లో ఆసీస్ బౌలర్లు పుంజుకుని లిటన్ దాస్, ముష్ఫికర్ రహీంను పెవిలియన్‌కు పంపినా బంగ్లా జోరును పూర్తిగా అడ్డుకోలేకపోయారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి బంగ్లాదేశ్ 6 వికెట్లకు 351 పరుగులు చేసింది. మెహిదీ హసన్ మిరాజ్ 32, హసన్ మహమూద్ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇప్పటికే 153 పరుగుల ఆధిక్యం సాధించిన బంగ్లాదేశ్ తొలి టెస్టుపై పట్టు బిగించింది.



# గార్డ్‌నర్‌కే క్రికెట్ ఆస్ట్రేలియా మద్దతు

**వైస్ కెప్టెన్‌గా కొనసాగించేందుకు నిర్ణయం**

**వ్యక్తిగత వివాదం జట్టుపై ప్రభావం చూపకుండా జాగ్రత్తలు**

**జార్జియా వోల్ ఎంపికపై చర్చలకు గార్డ్‌నర్ దూరం**

**తుది జట్టు ఎంపికలోనూ నిర్ణయాధికారం ఉండదని స్పష్టీకరణ**

**సిడ్నీ, ఆగస్టు 14:** వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆరోపణలతో వివాదంలో చిక్కుకున్న ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్‌కు క్రికెట్ ఆస్ట్రేలియా మద్దతుగా నిలిచింది. సహచర క్రీడాకారిణి జార్జియా వోల్‌తో గార్డ్‌నర్‌కు సంబంధం ఉందంటూ ఆమె భార్య మోనికా రైట్ చేసిన ఆరోపణల నేపథ్యంలోనూ వైస్ కెప్టెన్‌గా గార్డ్‌నర్‌ను కొనసాగించాలని బోర్డు నిర్ణయించింది. గార్డ్‌నర్ నాయకత్వ బాధ్యతలపై బోర్డు సమావేశంలో చర్చించినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్ తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం ఆమెను వైస్ కెప్టెన్‌గా కొనసాగించేందుకే మొగ్గు చూపినట్లు వెల్లడించారు. అయితే వ్యక్తిగత సంబంధాలు జట్టు ఎంపిక, వాతావరణంపై ప్రభావం చూపకుండా క్రికెట్ ఆస్ట్రేలియా కొన్ని జాగ్రత్తలు తీసుకుంది. వైస్ కెప్టెన్‌గా ఉన్నప్పటికీ తుది జట్టు ఎంపికలో గార్డ్‌నర్‌కు ఎలాంటి నిర్ణయాధికారం ఉండదని స్పష్టం చేసింది. ముఖ్యంగా జార్జియా వోల్ ఎంపిక, జట్టులో ఆమె స్థానం, ప్రదర్శన తదితర అంశాలపై సెలెక్టర్లు లేదా ఇతర అధికారులతో గార్డ్‌నర్ చర్చించకూడదని సూచించింది. జట్టులో అపోహలు, అసౌకర్య పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు బోర్డు పేర్కొంది. మిగిలిన అంశాలను సంబంధిత వ్యక్తుల వ్యక్తిగత వ్యవహారంగానే పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది.



# అశ్విన్ ఇంటికి సడన్‌గా పోలీసులు!

**వరుస ఫోన్‌కాల్స్‌తో మాజీ స్పిన్నర్‌లో టెన్షన్**

**'పోలీసులు వచ్చారు' అనగానే ఒక్కసారిగా షాక్**

**చివరకు విషయం తెలిసి ఊపిరి పీల్చుకున్న అశ్విన్**

**పాస్‌పోర్టు అందించేందుకే వచ్చారంటూ అసలు విషయం వెల్లడి**

**చెన్నై, ఆగస్టు 14:** టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఇంటికి అకస్మాత్తుగా పోలీసులు రావడం ఆయనను కాసేపు కంగారు పెట్టింది. తన ఛానల్ కోసం వీడియో రికార్డు చేస్తున్న సమయంలో జరిగిన ఈ ఆసక్తికర ఘటనను అశ్విన్ స్వయంగా వెల్లడించాడు. వీడియో రికార్డింగ్‌లో ఉండగా ఇంటి సెక్యూరిటీ గార్డు వరుసగా మూడు, నాలుగుసార్లు ఫోన్ చేశాడని అశ్విన్ తెలిపాడు. సాధారణంగా అతడు అన్నిసార్లు ఫోన్ చేయడని, అయితే రికార్డింగ్‌లో బిజీగా ఉండటంతో కాల్స్ పట్టించుకోలేదన్నాడు. అదే సమయంలో భార్య నుంచి కూడా ఫోన్ రావడంతో ఏదో ముఖ్యమైన విషయం జరిగిందని అనుమానం వచ్చిందని చెప్పాడు. తిరిగి భార్యకు ఫోన్ చేయగా ఇంటికి పోలీసులు వచ్చారని చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురైనట్లు అశ్విన్ తెలిపాడు. వెంటనే వారి వద్దకు వెళ్లగా అసలు విషయం తెలిసిందన్నాడు. వీసా కోసం తాను సమర్పించిన పాస్‌పోర్టును తిరిగి అందించేందుకే పోలీసులు వచ్చినట్లు తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నానని వివరించాడు. ఈ సందర్భంగా 'సెలబ్రిటీలకు కూడా ఇలాంటి సాధారణ అనుభవాలు ఎదురవుతాయా?' అని ఓ నెటిజన్ ప్రశ్నించగా.. తాను సాధారణ వ్యక్తిలా జీవించడానికే ఇష్టపడతానని అశ్విన్ సమాధానమిచ్చాడు. అశ్విన్ 2024 డిసెంబర్‌లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అనంతరం 2025లో ఐపీఎల్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటించాడు. భారత్ తరఫున అన్ని ఫార్మాట్లలో కలిపి 287 మ్యాచ్‌లు ఆడి 765 వికెట్లు సాధించాడు.

# అతీంద్రియ శక్తుల హర్రర్ స్టోరీ అగధ

ఈ వారం వరుస చిత్రాలు బాక్సాఫీస్‌కు క్యూ కట్టాయి. వాటిలో 'అగధ' ఒకటి. చిన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయిన ఓ యువతి మహాదేవి (కామాక్షి భాస్కర్ల). బాబాయ్ (భానుచందర్) దగ్గర వాళ్ల పిల్లలతో కలిసే పెరుగుతుంది. అనుకోకుండా ఓ రోజు ఓ దైవ శక్తి కనిపించి ఆమెను ఓ కొత్త మార్గంలో నడిపిస్తుంది. అప్పట్నుంచి ఆ శక్తి చెంతనే గడుపుతూ పెరిగి పెద్దదవుతుంది. అక్కడికి ఓ సాధువు వచ్చి కొన్ని యంత్ర, తంత్ర విద్యల్ని నేర్పించి, వాటిని ప్రజల మంచి కోసం ఉపయోగించాలని కోరతాడు. అప్పట్నుంచి ప్రజల్ని వేధించే అతీత శక్తుల నుంచి కాపాడుతూ పేరు సంపాదిస్తుంది. అందుకే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో మహాదేవి అంటే ఎంతో పేరు. అలాంటి మహాదేవిని పెంచిన బాబాయ్ కుటుంబానికి అగధ అనే అతీత శక్తి నుంచి ముప్పు ఏర్పడుతుంది. గర్భంతో ఉన్న బాబాయ్ కూతురు ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమెతోపాటు మరిన్ని మరణాలూ చోటు చేసుకుంటాయి. దాంతో తన కుటుంబాన్ని కాపాడుకోవడానికని సొంతూరికి వెళ్లాక అక్కడ మహాదేవికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి?ఇంతకీ అగధ ఎవరు?మహాదేవి కుటుంబాన్నే లక్ష్యంగా చేసుకోవడానికి కారణమేమిటి?దైవిక శక్తుల అండ ఉన్న మహాదేవికీ, అగధకీ మధ్య పోరాటం ఎలా సాగింది?ఎవరు గెలిచారన్నది చిత్ర కథ. చాలా రోజుల తర్వాత కేవలం భయాన్ని, థ్రిల్‌ని పంచడమే లక్ష్యంగా రూపొందిన సినిమానే... 'అగధ'. థ్రిల్లర్ సినిమాలకి తగ్గ వేగం ఇందులో కొరవడినా... ఆసక్తిని రేకెత్తించే కథా ప్రపంచంతోనూ, గాఢతతో కూడిన సన్నివేశాలతోనూ సినిమా చాలావరకూ లక్ష్యాన్ని అందుకుందీ చిత్రం. దైవ శక్తికీ, చీకటి శక్తికీ మధ్య సాగే పోరాటం చాలా సినిమాల్లో చూసినా అగధ చుట్టూ మలిచిన హారర్ సన్నివేశాలు, ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు సినిమాని ప్రత్యేకంగా మార్చాయి. హత్యల వెనకున్న అసలు కారణాల్ని మహాదేవి తనకు తెలిసిన విద్యల్ని ఉపయోగిస్తూ పరిశోధించే తీరు సినిమాకి హైలైట్. అసలు గుహలో ఉన్న అగధ ఎవరనే అంశంతోపాటు, ఆ రోజు గుహలోపల ఏం జరిగిందనే విషయాల చుట్టూ సాగే ద్వితీయార్ధంలో అనూహ్యమైన మలుపులు రక్తికట్టిస్తాయి. ముఖ్యంగా కథానాయకుడి పాత్రలో రెండో కోణం, అగధ ఆత్మ తరచూ ఎవరో ఒకరిలోకి దూరిపోయి చేసే హంగామా ఆకట్టుకుంటాయి. అయితే, కథలో ఒక దశ దాటిన తర్వాత ఇన్ని మలుపులా అనిపిస్తాయి. పతాక సన్నివేశాల్లో కాలయంత్రంతో ప్రతినాయకుడిని బంధీగా మార్చడమనే అంశం కొత్తగా ఉంటుంది. మొత్తంగా చాలా రోజుల తర్వాత పూర్తిస్థాయి హారర్ థ్రిల్లర్ సినిమా అనుభూతిని పంచడంలో ఈ




చిత్రం విజయం సాధించింది. కథకుడిగా కంటే దర్శకుడిగా సినిమాపై ప్రభావం చూపించారు ఎం.ఎస్.రాజు. అతీత శక్తులతో కూడిన కథా నేపథ్యం ఆసక్తిని రేకెత్తించినా, కథన రచన పాత పద్ధతుల్లోనే సాగింది. నిర్మాతగా ఆయన సినిమాల్లో కనిపించిన ప్రమాణాలకు తగ్గట్టుగానే, దర్శకుడిగా ఈ సినిమాని నాణ్యంగా తెరపైకి తీసుకొచ్చారు.




# టాక్సిస్ కోసం కియారా చాలా కష్టపడింది

## నటుడు యశ్ ప్రశంసలు



సినీ ప్రియులు ఎంతో ఎదురుచూస్తోన్న 'టాక్సిక్' మరికొన్నిరోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది . తాజాగా ఈ సినిమా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ముంబయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా యశ్ మాట్లాడుతూ.. కియారపై మరోసారి ప్రశంసలు కురిపించారు. కియార నిబద్ధత ఉన్న నటి. ఆమె ఈ సినిమా షూటింగ్‌కు వచ్చినప్పుడు నేను కొంచెం ఆందోళన పడ్డాను. ఎందుకంటే ఈ పాత్ర చాలా కఠినంగా ఉంటుంది. వర్షంలో తడిసే ఓ సన్నివేశం సులభంగా అయిపోతుందని అనుకున్నాం. కానీ, దానికి చాలా సమయం పట్టింది. ఆమె చాలా కష్టపడింది. ఆమె ప్రెగ్నెంట్ అని తెలిసిన తర్వాత కూడా అంతే అంకిత భావంతో సెట్స్‌కు వచ్చింది. నాతో పాటు గీతూ మోహన్‌దాస్ కూడా చాలా టెన్షన్ పడింది. మేమిద్దరం సెట్‌లో కియారకు బౌన్సర్లు, బాడీగార్డ్‌లుగా మారి జాగ్రత్తగా చూసుకున్నాం. ఆమె పడ్డ కష్టానికి తగిన గుర్తింపు కచ్చితంగా వస్తుంది. ఈ సినిమా ఆమె కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలుస్తుందని అన్నారు. ఇక ఇటీవల బెంగళూరులో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లోనూ కియారను యశ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి తాను ఎన్నో ఎదుర్కోవాల్సి వచ్చిందన్న యశ్.. ఎవరి మాటలనూ పట్టించుకోకుండా మనం చేయాల్సింది చేస్తూ వెళ్లడమేనని అన్నారు. ఇక ఈ సినిమా రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. వీటిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.

# 16న ఇరుముడి ప్రీరిలీజ్ వేడుక




మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్ కార్యక్రమాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఆగస్టు 16న హైదరాబాద్‌లోని శిల్పకళా వేదిక వేదికగా 'ఇరుముడి' ప్రీ రిలీజ్ వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'మల్లెపూల పల్లకి' పాటను విడుదల చేయనున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

# విశ్రాంతిని ఎంజాయ్ చేస్తున్న రష్మిక



టాలీవుడ్ ప్రముఖ నటి రష్మికా మందన్నా ప్రస్తుతం గాయం కారణంగా సినిమాలకు దూరంగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసిందే. అయితే ఈ రెస్ట్ సమయంలో తన ఆలోచనల్లో వచ్చిన మార్పుల గురించి ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఎప్పుడూ తీరిక లేకుండా ఉరుకులు పరుగులతో బిజీగా గడిపేవారికి, ఒక్కసారిగా పనులు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం మొదట్లో చాలా భయంగా అనిపిస్తుందని రష్మిక తెలిపారు. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో అలా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తే.. గతంలో అలా పిచ్చివాళ్లలా పనుల వెనకే పరిగెత్తిన దినాలు ఇప్పుడు తలచుకుంటే మరింత భయంగా అనిపిస్తాయని, బహుశా జీవితం అంటే ఇదేమో అని ఆమె పేర్కొన్నారు. ఎలాంటి అలారాలు పెట్టుకోకుండా శరీరం కోరిన సమయానికి లేవడం, రోజుకు రెండు పూటల మితంగా భోజనం చేయడం, తన పెంపుడు కుక్క 'ఆరా'తో సమయం గడపడం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పుస్తకాలు చదవడం, పజిల్స్ చేయడం, ఇష్టమైన షోలు చూడటంతో పాటు పాత ఫోటోలు, వీడియోలను నెమరువేసుకుంటూ ప్రశాంతంగా గడుపుతున్నానని చెప్పారు. ఈ కష్టకాలంలో తాను త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ అభిమానులు, శ్రేయోభిలాషులు పంపిస్తున్న ప్రార్థనలకు, చూపుతున్న ప్రేమానురాగాలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్ర షూటింగ్‌లో భాగంగా ఒక డ్యాన్స్ సీక్వెన్స్ చేస్తుండగా రష్మిక తుంటి భాగంలో గాయమైంది. వైద్యుల సూచన మేరకు ఆమె కొన్ని వారాల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో ప్రస్తుతం పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.

# శ్రీను వైట్ల దర్శకత్వంలో శర్వానంద్





టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన క్రేజీ కాంబినేషన్ అధికారికంగా పట్టాలెక్కింది. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే చార్మింగ్ హీరో శర్వానంద్, విలక్షణమైన కామెడీ టైమింగ్‌తో కూడిన ఎంటర్‌టైనర్లను తెరకెక్కించే ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో తొలిసారిగా కలిసి పనిచేస్తున్నారు. వీళ్లిద్దరి కలయికలో రాబోతున్న ఈ సరికొత్త ప్రాజెక్ట్‌పై టాలీవుడ్ వర్గాల్లో మరియు ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిల్ సుంకర నిర్మాణంలో ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కుతుండగా తాజాగా ఈ సినిమా టైటిల్‌తో పాటు పూజా కార్యక్రమాలు ఘనంగా జరుపుకున్నారు. ఇక ఈ సినిమాకు మేకర్స్ 'జార్జ్ క్రిష్' అనే క్రేజీ టైటిల్‌ను ఖరారు చేశారు. శ్రీను వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్, శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నాయి. సినిమా ప్రారంభోత్సవ రోజే విడుదల తేదీని ప్రకటించి మేకర్స్ అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. లాంచింగ్ రోజే రిలీజ్ డేట్ అనౌన్స్ చేయడంతో ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో కూడా మంచి బజ్ క్రియేట్ అయింది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.